

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శుక్రవారం 27-06-2025 | సంపుటి - 24 | సంచిక - 55 | రూ : 4 | పేజీలు: 8

# నింగినంటిన సంబరం

- ఐఎస్ఎస్‌లో అడుగిడిన తొలి భారతీయుడు
- చరిత్ర సృష్టించిన శుభాంశు..
- నిల్చోవడం సులభంగా ఉంది.. తల భారంగా ఉంది..
- శుక్లా తొలి పలుకులు
- చిన్న పిల్లాడిలా నేర్చుకుంటున్నానని వ్యాఖ్య

**జూన్ 26, ఢిల్లీ:** గగనతలంలో భారత్ చరిత్ర లిఖించింది. అంతరిక్ష యాత్రలో సరికొత్త అధ్యాయానికి నాంది పలికింది. 140 కోట్ల మంది భారతీయుల ఆకాంక్షలు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని (ఐఎస్ఎస్) తాకాయి. భారత అంతరిక్ష చరిత్రలో ఐఎస్ఎస్‌ను చేరిన తొలి భారతీయుడిగా శుభాంశు శుక్లా రికార్డు సృష్టించారు. 39 ఏళ్ల శుక్లా.. గురువారం సాయంత్రం ఐఎస్ఎస్‌లోకి వెళ్లగానే దేశం మొత్తం విజయగర్వంతో ఉప్పొంగిపోయింది. సంబరాలు 'నింగి'నంటాయి. విజయవంతంగా అనుసంధానం: ఫాల్కన్ 9 రాకెట్ ద్వారా భారత కాలమానం ప్రకారం.. బుధవారం మధ్యాహ్నం 12.01 గంటలకు బయలుదేరిన డ్రాగన్ వ్యోమనౌక 'గ్రేస్'..

తరువాయి 2లో





# ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఊరట

- రూ.180 కోట్ల వైద్య బిల్లుల విడుదల
- 26,519 మంది ఉద్యోగులు, పింఛనుదారులకు లబ్ధి
- ఉద్యోగులు, ప్రభుత్వం ఒక ఆదర్శ కుటుంబమన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**జూన్ 26, హైదరాబాద్ :** ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఊరటనిచ్చేలా.. పెండింగ్‌లో ఉన్న మెడికల్ రీయింబర్స్‌మెంట్

తరువాయి 2లో



## జగదాంబిక అమ్మవారికి

# తొలి బోనం

- భాగ్యనగరిలో ప్రారంభమైన ఉత్సవాలు

**జూన్ 26, హైదరాబాద్:** రాజధానిలో బోనాల సందడి మొదలైంది. గురువారం గోల్కొండ కోటలోని శ్రీజగదాంబిక అమ్మవారికి బంగారు బోనం సమర్పించడంతో నెల రోజుల పండగ ప్రారంభమైంది. మహిళలు బోనాలతో వచ్చి.. మొక్కులు చెల్లించుకోగా శివసత్తుల పూనకాలు, డప్పు చప్పుళ్లు, పోతురాజుల విన్యాసాలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. లంగర్‌హౌస్ చౌరస్తాలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖలు అమ్మవారి తొట్టెల, ఫలహారం బండికి పూజలు నిర్వహించారు. అక్కడే గోల్కొండ ఖిలా జగదాంబిక అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి, కల్లు సాక పెట్టి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున స్పీకర్, మంత్రులు

తరువాయి 2లో

## ఐఐటియన్లనూ..

# అడ్డదారులు తొక్కించారు









- మద్యం కుంభకోణంలో పావులుగా వాడుకున్నారు
- సివిల్స్‌కు సన్నద్ధమైన వ్యక్తిని.. ముడుపుల సొమ్ముకు కాపలాదారుగా మార్చేశారు
- డబ్బుల ఆశ చూపి.. ఎంతోమందిని అవినీతి ఉచ్చులోకి దింపారు
- ఉన్నత విద్యావంతుల జీవితాలతో చెలగాటమాడిన వైకాపా మద్యం ముఠా

2లో




# గంజాయి, డ్రగ్స్‌పై.. సమరం

- ఎవరు అడ్డొచ్చినా తొక్కుకుంటూ పోతాం
- ఈగల్ ద్వారా మాదకద్రవ్యాలపై డేగకన్ను
- గంజాయి బ్యాచ్‌లకు, వారి వెనక ఉన్నవారికి బుద్ధి చెబుతాం
- పద్ధతి మారకుంటే ఇక్కడ ఉండటానికి అర్హత లేదు
- మాదకద్రవ్యాల వ్యతిరేక సదస్సులో సీఎం చంద్రబాబు

'రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్‌పై యుద్ధం ప్రకటిస్తున్నా. ఎవరు అడ్డొచ్చినా తొక్కుకుంటూ పోతాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హెచ్చరించారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా గుంటూరులో గురువారం ఆయన యువతతో కలిసి వాకథాన్‌లో పాల్గొన్నారు. యువత పెద్దఎత్తున పాల్గొన్న ఈ ర్యాలీలో చంద్రబాబు సుమారు అర కిలోమీటరు దూరం వారితో నడిచారు. అనంతరం శ్రీకన్వెన్షన్‌లో నిర్వహించిన సదస్సులో.. యువతతో డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చుదామంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా

తరువాయి 2లో

# లక్షకు పైగా ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్

- వేగంగా పూర్తిచేయడంపై ప్రభుత్వం దృష్టి
- నెమ్మదిగా సాగుతున్న జిల్లాలపై ప్రత్యేక శ్రద్ధ

2లో



## డ్రగ్స్ పట్టుబడితే

# విద్యాసంస్థలపైనా కేసులు

- స్కూళ్లు, కళాశాలల దగ్గర గంజాయి చాక్లెట్ల సంస్కృతేంటి?
- చదువులు చెప్పడంతోనే యాజమాన్యాల బాధ్యత తీరిపోదు
- పిల్లల్లో వ్యసనాలను కనిపెట్టాలి
- ఎవరైనా మాదకద్రవ్యాలతో రాష్ట్రంలోకి రావాలంటే భయపడాలి
- అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

2లో

# నింగినంటిన సంబరం

(మొదటిపేజీ తరువాయి)

గురువారం సాయంత్రం 400 కిలోమీటర్ల ఎత్తున ఉన్న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం వద్దకు చేరింది. సరిగ్గా సాయంత్రం 4.15 గంటలకు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంతో డాకింగ్ ప్రక్రియ పూర్తయింది. దీనికి రెండు గంటల కంటే తక్కువ సమయమే తీసుకుంది. అంతరిక్ష కేంద్రానికి చేరడానికి 14 నిమిషాల ముందు సరిగ్గా 4.01 గంటలకు ఐఎస్ఎస్ హార్మనీ మాడ్యూల్‌తో ఉత్తర అట్లాంటిక్ సముద్రంపై ఉండగా సాఫ్ట్ క్యాప్చర్ లక్ష్యాన్ని వ్యోమనౌక సాధించింది.

**30 నిమిషాల ముందే..**

* డాకింగ్ ప్రక్రియకు ముందు తొలుత ఫేజింగ్ దశ సాగింది. ఇందులో 16 డ్రాకో థ్రస్టర్లు ప్రజ్వరిల్లి.. డ్రాగన్ వ్యోమనౌక కక్ష్యను పెంచాయి. తద్వారా అది ఐఎస్ఎస్ ఉన్న కక్ష్యకు చేరువైంది.
* తదుపరి దశలో డ్రాగన్.. ఐఎస్ఎస్‌కు 2.5 కిలోమీటర్ల దిగువన, 7 కిలోమీటర్ల దూరానికి చేరుకుంది. ఈ దశలో ఇంజిన్ 90 సెకన్లపాటు మండిన తర్వాత అంతరిక్ష కేంద్రానికి మరింత చేరువైంది.
* ముందు దశలన్నీ అత్యంత కచ్చితత్వంతో సాగడం వల్ల 220 మీటర్ల (వే పాయింట్ 1), 20 మీటర్ల (వే పాయింట్ 2) దూరంలో చేపట్టాల్సిన విన్యాసాల అవసరం తప్పింది. దీంతో డ్రాగన్ ప్రయాణం దాదాపు 30 నిమిషాలపాటు తగ్గింది.
* చివర్లో డ్రాగన్ వ్యోమనౌక.. ఐఎస్ఎస్‌కు 20 మీటర్ల దూరంలోకి వెళ్లింది. లేజర్ ఆధారిత సెన్సర్లు, కంప్యూటర్ గణాంకాలు, కెమెరాలతో అత్యంత కచ్చితత్వంతో అంతరిక్ష కేంద్రంలోని హార్మనీ మాడ్యూల్‌కు సంబంధించిన డాకింగ్ పోర్ట్ దగ్గరకు వచ్చింది.
* ఐఎస్ఎస్‌కు మరింత చేరువయ్యాక 'సాఫ్ట్ క్యాప్చర్' జరిగింది. ఫలితంగా రెండు వ్యోమనౌకలు అనుసంధానమయ్యాయి. అనంతరం హార్డ్ మేటింగ్ ప్రక్రియ జరిగింది. ఇందులో ఐఎస్ఎస్, డ్రాగన్ వ్యోమనౌక.. 12 జతల హుక్‌లతో పరస్పరం దృఢంగా అనుసంధానమయ్యాయి. రెండింటి మధ్య కమ్యూనికేషన్, పవర్ లింక్‌లు ఏర్పడ్డాయి.
* డాకింగ్ పూర్తయ్యాక.. లీకేజీ తనిఖీలు, ప్రెజరైజేషన్ ప్రక్రియల అనంతరం ఐఎస్ఎస్‌లోని ఏడుగురు సిబ్బంది.. 5.44 కల్లా హ్యాచ్ ఓపెనింగ్ ప్రక్రియను పూర్తి చేశారు. ఆ వెంటనే 5.53కు యాక్సియం4 మిషన్ కమాండర్ పెగ్గీ విట్సన్ ఐఎస్ఎస్‌లోకి అడుగుపెట్టారు. ఆమె వెంటే గ్రూప్ కెప్టెన్, భారతీయ ఫైటర్ పైలట్ శుభాంశు శుక్లా.. సరికొత్త చరిత్రను లిఖిస్తూ ఐఎస్ఎస్‌లో ప్రవేశించారు.
* ఆ తర్వాత మిషన్ స్పెషలిస్టులు.. పోలండ్‌కు చెందిన ఇంజినీరు స్లావోస్జ్ ఉజ్నాన్స్‌కీవిస్నియెస్కీ, హంగరీకి చెందిన మెకానికల్ ఇంజినీరు టిబర్ కపు ఐఎస్ఎస్‌లోకి అడుగుపెట్టారు. వారంతా కరచాలనాలతో, కౌగిలింతలతో ఆనందాన్ని పంచుకున్నారు.

# గంజాయి, డ్రగ్స్‌పై.. సమరం

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతూ.. 'గత ప్రభుత్వం గంజాయి కట్టడిపై దృష్టి పెట్టలేదు. ఎన్ని ఆందోళనలు చేసినా అప్పటి సీఎం జగన్ పట్టించుకోలేదు. మేం పోరాడితే మా కార్యాలయంపై దాడి చేసి తెదేపా కార్యకర్తలపై కేసులు పెట్టారు. ఇటీవల పోలీసులపై దాడి చేసిన గంజాయి బ్యాచ్‌పై చర్యలు తీసుకుంటే వారికి మద్దతుగా వందలమంది ర్యాలీగా వెళ్లి గొడవ చేశారు. అలాంటివారిని వదిలిపెట్టాలా?' అని ప్రశ్నించారు. 'రాజకీయ ముసుగు తొలగిస్తాం. గంజాయి బ్యాచ్‌లకు, వారి వెనక ఉన్నవారికి బుద్ధి చెబుతాం. తప్పుడు కార్యక్రమాలతో రాజకీయ లబ్ధి పొందాలనుకుంటే కుదరదు. మాదకద్రవ్యాల వాడకంతో కొందరు మృగాల్లా మారుతున్నారు. గంజాయి మత్తులో మూడేళ్ల పసిపిల్లలపైనా అత్యాచారాలకు పాల్పడుతున్నారు. అలాంటివారిని క్షమించాలా?' అని ప్రశ్నించారు.

**మూడోకన్ను ఎప్పుడూ చూస్తూనే ఉంటుంది**

'గంజాయి, డ్రగ్స్‌ను నిర్మూలించడం ప్రభుత్వ బాధ్యతే కాదు. ప్రతిపక్షాలు కూడా ముందుకు రావాలి. ప్రజల్ని మెప్పించి ఓట్లేయించుకోండి. తప్పుడు పనులతో రాజకీయ లబ్ధి పొందాలనుకుంటే కుదరదు' అని చంద్రబాబు స్పష్టం చేశారు. 2021లో దేశంలో సాగయ్యే గంజాయిలో 50 శాతం ఏపీ, ఒడిశా రాష్ట్రాల్లోనే పండేదని ఆందోళన వ్యక్తం చేశారు. గంజాయి సరఫరాకు విశాఖను కేంద్రంగా చేయడం బాధ కలిగించిందన్నారు. మారితే మారండి.. మారకుంటే ఈ రాష్ట్రంలో ఉండటానికి అర్హత లేదు. మన్యంలో 10,000 ఎకరాల్లో గంజాయి సాగును అడ్డుకున్నాం. ఉపగ్రహ, గూగుల్, డ్రోన్ వంటి సాంకేతిక వ్యవస్థలతో కట్టడి చేస్తున్నాం. ఈగల్ పేరుతో రాష్ట్రంపై డేగకన్ను వేశాం. మత్తు, మాదకద్రవ్యాలను ఆ మూడోకన్ను ఎప్పుడూ చూస్తూనే ఉంటుంది. ప్రజా పోలీసింగ్ కూడా ఎంతో ముఖ్యం' అని సీఎం స్పష్టం చేశారు. టోల్‌ఫ్రీ నంబర్ 1972కు ఫోన్ చేసి సమాచారం ఇస్తే చాలు.. మత్తు బ్యాచ్‌ల సంగతి ప్రభుత్వం చూసుకుంటుందని భరోసా ఇచ్చారు.

# జగదాంబిక అమ్మవారికి తొలి బోనం

(మొదటిపేజీ తరువాయి)

అమ్మవారికి మొక్కులు చెల్లించారు. సమృద్ధిగా వర్షాలు పడి, అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నట్టు మంత్రులు తెలిపారు. పొన్నం ప్రభాకర్ భక్తులతోపాటు నృత్యం చేస్తూ ఉత్సాహపరిచారు. జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్, బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్, దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లంగర్‌హౌస్ చౌరస్తా నుంచి గోల్కొండ బడాబజార్‌లోని పూజారి ఇంటికి ఊరేగింపు సాగింది. పూజారి ఇంటి నుంచి అమ్మవారిని గోల్కొండ వరకు భక్తులు తోడ్కొని వెళ్లారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, భారాస ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి గోల్కొండ కోటలో అమ్మవారిని దర్శించుకున్నారు.

# ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఊరట

(మొదటిపేజీ తరువాయి)

బిల్లులను ప్రభుత్వం గురువారం విడుదల చేసింది. ఈ మేరకు మొత్తం రూ. 180.38 కోట్లను డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క విడుదల చేశారు. ఈ నిర్ణయంతో 26,519 మంది ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఊరట కలిగింది. తొమ్మిది రోజుల వ్యవధిలోనే రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులను జమ చేసి రికార్డు సృష్టించిన ప్రజా ప్రభుత్వం.. మరుసటి రోజే ఉద్యోగుల వైద్య ఖర్చుల బిల్లులను కూడా విడుదల చేసి చిత్తశుద్ధిని నిరూపించుకుందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఒక ప్రకటనలో తెలిపారు. "ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రెండు డీఏలు విడుదల చేయాలని ఈ నెల 13న ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో 3.50 లక్షల మంది ఉద్యోగులు, మూడు లక్షల మంది పెన్షనర్లకు ఆర్థిక ప్రయోజనం చేకూరింది. ఒక డీఏకు ఏటా ప్రభుత్వ ఖజానాపై రూ.2,400 కోట్ల ఆర్థికభారం పడుతున్నా.. ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా భావించి ప్రభుత్వం డీఏల విడుదలకు చొరవ చూపింది. ఉద్యోగులు, పెన్షనర్లు గత 27 నెలలుగా వైద్య ఖర్చుల బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు. తీవ్ర ఆర్థిక ఇబ్బందులున్నా.. ఈ బిల్లులను తాజాగా క్లియర్ చేశాం. గత ప్రభుత్వ కాలం నాటి (04032023) నుంచి ప్రస్తుత ప్రభుత్వ హయాం (20062025) వరకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను ఒకేసారి చెల్లించాం. వీటితోపాటు మహిళా శిశు సంక్షేమం, ప్రణాళికాశాఖల్లో ఉద్యోగుల సంఖ్యను పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది.

# డ్రగ్స్ పట్టుబడితే విద్యాసంస్థలపైనా కేసులు

రాబోయే రోజుల్లో కళాశాలలు, పాఠశాలల ప్రాంగణాల్లో మాదకద్రవ్యాలు పట్టుబడితే యాజమాన్యాల మీద కేసులు పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఫీజులు వసూలు చేయడం తప్ప.. పిల్లల బాధ్యత తమది కాదని విద్యాసంస్థలు భావిస్తే కుదరదని స్పష్టం చేశారు. స్కూళ్లు, కళాశాలల దగ్గర కిరాణా దుకాణాల్లో గంజాయి చాక్లెట్లు విక్రయించే సంస్కృతి కనిపిస్తోందని, అలాంటి వాతావరణం ఉంటే విద్యార్థులు వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలని సూచించారు. అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మాదాపూర్ శిల్పకళావేదికలో తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. సినీ నటులు రామ్‌చరణ్, విజయ్ దేవరకొండతో కలిసి శిల్పకళావేదికలో ఏర్పాటు చేసిన ప్రదర్శనను వీక్షించిన అనంతరం సీం మాట్లాడుతూ.. "తల్లిదండ్రులు ఉద్యోగాల్లో తలమునకలై విద్యాసంస్థలపై నమ్మకంతో రూ.లక్షలు చెల్లించి పిల్లల్ని చేర్పిస్తున్నారు. పిల్లలు ఎక్కువ సమయం విద్యాసంస్థల్లోనే గడుపుతున్నారు. అందుకే చదువు చెప్పడంతోనే యాజమాన్యం బాధ్యత అయిపోదు. పిల్లల్లో వచ్చే మార్పులు, వారు ఎలాంటి వ్యసనాలకు లోనవుతున్నారో పర్యవేక్షించాల్సిన సామాజిక బాధ్యత విద్యాసంస్థలపై ఉంది. విద్యార్థుల ప్రవర్తనలో వచ్చే మార్పుల్ని గమనించడానికి మానసిక నిపుణుల్ని నియమించుకోవాలి.

*** గంజాయి హబ్‌గా మారితే మనం విఫలమైనట్టే..**

ఉద్యమ స్ఫూర్తితో ముందుకెళ్లాల్సిన తెలంగాణ.. డ్రగ్స్ మహమ్మారికి బలి కాకూడదు. రాష్ట్రంలోని పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీల వరకూ విద్యార్థులు గంజాయి, డ్రగ్స్‌కు బానిసలవుతుంటే చూస్తూ ఊరుకుందామా? దీన్ని నిర్మూలించడానికి సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన మరుక్షణమే.. మాదకద్రవ్యాల మాఫియా వెన్ను విరుస్తామని స్పష్టంగా చెప్పాను. మాదకద్రవ్యాలతో ఎవరైనా ఈ రాష్ట్ర సరిహద్దుల్లో కాలుపెట్టాలంటే భయపడేలా పనిచేయాలని పోలీసులకు ఆదేశాలిచ్చా. అవసరమైతే సరిహద్దులు దాటి వారి వెన్ను విరచాలని స్పష్టంగా చెప్పా. డ్రగ్స్ నియంత్రణ బాధ్యత కేవలం ప్రభుత్వానిది మాత్రమే కాదు. ఈ దేశాన్ని ఎదుర్కోలేమని భావించే శత్రువులు గంజాయి, డ్రగ్స్‌తో యువతను నిర్వీర్యం చేసే ప్రమాదముంది. ఒకప్పుడు భారత స్వాతంత్ర్యోద్యమం, ఆ తర్వాత యుద్ధంలో దేశ రక్షణకు ఉక్కు కవచంగా నిలిచిన పంజాబ్ యువత ఇప్పుడు డ్రగ్స్ మహమ్మారితో పూర్తిగా నిర్వీర్యమైంది. అక్కడి కుటుంబాలు అంతులేని దుఃఖంలో మునిగిపోతున్నాయి. తెలంగాణకు అలాంటి పరిస్థితి రానివ్వకుండా అందరం అప్రమత్తమవ్వాలి. తెలంగాణ అంటే ఒక ఐటీ, ఫార్మా హబ్.. ఈ రాష్ట్రం గంజాయికి అడ్డాగా మారితే మనమంతా విఫలమైనట్లే. అందుకే మనమంతా అప్రమత్తమై పోలీసింగ్ చేసినప్పుడే వాటిని నియంత్రించగలం. పాఠశాలలు, కళాశాలల్లో మాదకద్రవ్యాలకు సంబంధించి సమాచారముంటే విద్యార్థులే పోలీసులకు ఉప్పందించండి. నో డ్రగ్స్‌కు మీరే వారధులుగా మారి 1908 టోల్‌ఫ్రీ నంబరుకు చెప్పండి" అని ముఖ్యమంత్రి సూచించారు.

*** చిరంజీవి వ్యసనాలకు లోను కాలేదు**

సినీ నటుడు రామ్‌చరణ్ నా కళ్ల ముందే పాఠశాలకు వెళ్లారు. ఇప్పుడు నిజమైన స్టార్‌గా చిత్రపరిశ్రమలో రాణిస్తున్నారు. ఆయన నటించిన ఆర్ఆర్ఆర్ చిత్రం ఆస్కార్ అవార్డు పొందింది. ఆయన తండ్రి చిరంజీవి ఎంతో కష్టపడి దేశం గర్వించదగ్గ మహానటుడిగా గుర్తింపు పొందారు. 50 ఏళ్ల నిరంతర శ్రమతో ఎదిగారు. ఎన్ని కష్టాలు, అవమానాలు ఎదురైనా ఆయన కుంగిపోలేదు. భయపడి మాదకద్రవ్యాలు, వ్యసనాలకు బానిస కాలేదు. ధైర్యంగా నిలబడి రాణించారు. నటులు సినిమాల్లో పోషించే పాత్రలను కాదు.. వారి జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలి. నేను నల్లమల అడవుల నుంచి జడ్పీటీసీ సభ్యుడు, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎంపీ, పీసీసీ అధ్యక్షుడు.. ఇలా ఒక్కో అడుగు వేసుకుంటూ 16 ఏళ్లలో ముఖ్యమంత్రి స్థాయికి వచ్చా. మా పాలమూరు జిల్లా నుంచి వచ్చిన నటుడు విజయ్ దేవరకొండ ఎంతో మంది ప్రజల అభిమానం పొందారు. కష్టం, నిబద్ధత లేకుండా ఈ స్థాయికి రాలేరు. అందుకే తెలంగాణ యువత ప్రపంచంతో పోటీపడాలనే ఉద్దేశంతో ఏ రాష్ట్రానికి లేని తరహాలో స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశాం. రాబోయే రోజుల్లో ప్రపంచ దేశాలు క్రీడల శిక్షణ కోసం హైదరాబాద్‌కు రావాలనే రీతిలో క్రీడా విధానం తెచ్చాం. ప్రపంచంతో పోటీపడాలనే ఉద్దేశంతో తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ తీసుకురావాలని నిర్ణయించాం. క్రీడల్లో రాణించడమే కాదు.. పదేళ్లలో ట్రిలియన్ డాలర్లు, 22 ఏళ్లలో మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయాలని ప్రణాళిక రూపొందించాం.

*** అందుకే 'ఈగల్' పేరు**

తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరోను ఇకపై 'ఈగల్' (ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్)గా పిలవాలని నిర్ణయించుకున్నాం. గద్ద ఆకాశంలో 20 30 వేల అడుగుల ఎత్తులో ఎగిరినా.. నేల మీదున్న లక్ష్యాన్ని నిశితంగా గమనిస్తుంది. దాని సక్సెస్ రేటు 100 శాతం. అందుకే 'ఈగల్' అని పేరు పెట్టాం. ఈ మధ్యకాలంలో గద్దలకు యాంటీ డ్రోన్ శిక్షణ ఇస్తున్నాం. ఎక్కడైనా వీవీఐపీలు ఉన్న ప్రాంతంలో డ్రోన్‌లు ఎగరేస్తే అవి గుర్తిస్తాయి. అదే తరహాలో.. రాష్ట్రంలో ఎక్కడ గంజాయి పండించినా 'ఈగల్' విభాగం తన నిఘాతో కనిపెడుతుంది. తెలంగాణలోని 1.5 కోట్ల ఎకరాల సాగుభూముల్లో ఎక్కడ గంజాయి మొక్క పెరిగినా గుర్తిస్తుంది. సరిహద్దుల్లోకి డ్రగ్స్ రవాణాను నిశితంగా గమనిస్తుంది" అని సీఎం పేర్కొన్నారు.

# ఐఐటీయన్లమూ.. అడ్డదారులు తొక్కించారు

'తా చెడ్డ కోతి వనమెల్లా చెరిచింది' అన్నట్లుగా అవినీతి, అక్రమాల్లో ఆరితేరిన వైకాపా మద్యం ముఠా ఉన్నత విద్యావంతులైన అనేకమంది యువకుల్ని ఈ ఉచ్చులోకి దించింది. ఖరగ్‌పుర్, మద్రాస్ వంటి ప్రతిష్ఠాత్మక ఐఐటీల్లో చదువుకుని పట్టభద్రులైన పలువుర్ని మద్యం కుంభకోణంలో కీలక పాత్రధారులుగా మార్చేసింది. సివిల్ సర్వీసెస్ పరీక్షకు సన్నద్ధమైన యువకుణ్ని.. ముడుపుల సొత్తుకు కాపలాదారుగా వాడేసుకుంది. ప్రఖ్యాత సంస్థల్లో ఇంజినీరింగ్ పూర్తిచేసి కెరీర్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్న యువతను ముడుపులు వసూలు చేసే కొరియర్లుగా, వాటిని ఒకచోట నుంచి మరో చోటకు చేర్చే హ్యాండ్లర్లుగా తయారుచేసింది. కొందరు తెలిసే ఈ కుంభకోణంలో భాగస్వాములవగా.. మరికొందరు మాత్రం ఇదేదో ప్రభుత్వ ప్రాజెక్టు అనుకుని అడుగుపెట్టి క్రమంగా ఆ ఊబిలో కూరుకుపోయారు. చేతి నిండా డబ్బు వస్తుండడంతో ఆ అడ్డదారిలోనే కొనసాగారు. వైకాపా మద్యం ముఠా చేతుల్లో కీలుబొమ్మలయ్యారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారి.. మద్యం కుంభకోణం మూలాలు వెలికితీస్తుండటంతో దీనిలో కీలక పాత్రధారులుగా వ్యవహరించిన వారిని విదేశాలకు పంపేశారు. మరికొందరైతే వారి ఉనికి బయటపడకుండా బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఈ కుంభకోణంలోని పాత్రధారుల్లో ఎక్కువమంది ఐఐటీల్లో చదివినవారు, ఇంజినీరింగ్ పట్టభద్రులేనని సిట్ గుర్తించింది. వారిలో కొంతమంది సాక్షులుగా వచ్చి.. తాము ఈ కుంభకోణంలో ఎలా పాత్రధారులుగా మారామో సిట్ అధికారుల ముందు చెబుతున్నారు.

*** ఐటీ సలహాదారు పదవిని అడ్డం పెట్టుకుని.. ఉచ్చులోకి లాగిన రాజ్ కెసిరెడ్డి**

మద్యం కుంభకోణంలో ప్రధాన నిందితుడైన రాజ్ కెసిరెడ్డి నాటి ముఖ్యమంత్రి జగన్‌కు అత్యంత సన్నిహితుడు. అందుకే ఆయనకు రాష్ట్రప్రభుత్వ ఐటీ సలహాదారు పదవి కట్టబెట్టారు. దాన్ని అడ్డం పెట్టుకుని రాజ్ కెసిరెడ్డి అనేకమంది ఉన్నత విద్యావంతుల్ని, ఇంజినీరింగ్ పట్టభద్రుల్ని మద్యం కుంభకోణం ఉచ్చులోకి లాగారు. ఏపీ ప్రభుత్వం నుంచి ప్రాజెక్టులు ఇప్పిస్తానని, ఆ ప్రాజెక్టుల్లో కీలక స్థానాల్లో నియమిస్తానని ప్రలోభపెట్టారు. అవన్నీ నిజమేనని నమ్మినవారి జీవితాల్ని నిలువునా ముంచేశారు. మద్యం కుంభకోణం కేసులో తొమ్మిదో నిందితుడు (ఏ9)గా ఉన్న తూకేకుల ఈశ్వర్ కిరణ్‌కుమార్‌రెడ్డిని ముందు పెట్టుకుని అనేకమందిని ఈ ఊబిలోకి దింపారు.

*** ఐఐటీ ఖరగ్‌పుర్‌లో చదివి.. మద్యం ముడుపుల రూటింగ్‌లో ఆరితేరి..**

తిరుపతికి చెందిన తూకేకుల ఈశ్వర్‌కిరణ్‌కుమార్‌రెడ్డి ఓ హెడ్‌కానిస్టేబుల్ కుమారుడు. ఐఐటీ ఖరగ్‌పుర్‌లో చదువుకున్నాడు. 2015లో డీకార్ట్ లాజిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థను స్థాపించాడు. ఫ్లిప్‌కార్ట్ సరకుల డెలివరీ బాధ్యతల్ని డీకార్ట్ కంపెనీ తరఫున నిర్వహించేవాడు. రాజ్ కెసిరెడ్డితో పరిచయమవటంతో ఇది పెద్ద కుంభకోణం అని తెలిసీ మద్యం దందాలో కీలక పాత్రధారిగా మారాడు. ప్రధానంగా డిస్టిలరీలు, మద్యం సరఫరా కంపెనీల నుంచి ముడుపుల సొమ్మును దర్యాప్తు సంస్థలకు చిక్కకుండా రాబట్టుకునేందుకు డొల్ల కంపెనీలను స్థాపించాడు. డిస్టిలరీలు, మద్యం సరఫరా కంపెనీలు చెల్లించే ముడుపుల సొమ్మును వీటి ద్వారా రూటింగ్ చేసేవాడు.

*** పూర్వ విద్యార్థుల సమావేశానికి వెళ్లి..**

ఈశ్వర్ కిరణ్‌కుమార్‌రెడ్డి కొన్నేళ్ల కిందట ఐఐటీ ఖరగ్‌పుర్ పూర్వవిద్యార్థుల సమావేశానికి హాజరయ్యాడు. తాను అనేక కంపెనీలను స్థాపించానని.. తన వ్యాపారసంస్థలు 7 రాష్ట్రాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయంటూ చెప్పుకొన్నాడు. అదంతా నిజమేనని నమ్మించేందుకు ఆ సమావేశంలో ఐఐటీ ఖరగ్‌పుర్‌కు రూ.10 లక్షలు విరాళంగా ప్రకటించాడు. ఏపీ ప్రభుత్వంలో అప్పట్లో ఐటీ సలహాదారుగా ఉన్న రాజ్ కెసిరెడ్డితో అతనికి సన్నిహిత సంబంధాలున్నాయని తెలియడంతో.. ఏవైనా ప్రాజెక్టులుంటే చూడాలంటూ ఐఐటీ పూర్వవిద్యార్థులు పలువురు కిరణ్‌కుమార్‌రెడ్డిని ఆశ్రయించారు. వారిలో కొందరిని కిరణ్‌కుమార్‌రెడ్డి ఎంపికచేసుకుని వారికి తెలియకుండానే మద్యం కుంభకోణంలో పాత్రధారులుగా మార్చేశాడు.

*** ఐఐటీలో చదివి.. ముడుపుల వసూళ్ల ఏజెంటుగా మారి**

సైమన్ ప్రసన్.. ఐఐటీ నుంచి ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. మంచి కెరీర్ చూపిస్తామని ఆశపెట్టి కిరణ్‌కుమార్‌రెడ్డి, రాజ్ కెసిరెడ్డిలు అతణ్నీ ఈ కుంభకోణంలోకి దించారు. సైమన్ ప్రసన్ తొలుత మద్యం డిస్టిలరీలు, సరఫరా కంపెనీల నుంచి ముడుపుల వసూళ్ల బాధ్యతలు చూసేవాడు. తర్వాత రాజ్ కెసిరెడ్డి సూచనల మేరకు ఆ డబ్బును చేర్చాల్సిన చోటకు చేర్చేవాడు. గత సార్వత్రిక ఎన్నికలకు ముందు అనేకసార్లు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అనుచరులకు ముడుపుల సొమ్ము అందజేయటంలో కీలకంగా వ్యవహరించాడు. సైమన్ కూడా ఇప్పుడు పరారీలోనే ఉన్నాడు.

*** ఏపీ హెడ్ అంటూ చెప్పి.. అతని పేరుతో రూ.వందల కోట్ల వ్యాపారం**


సికింద్రాబాద్‌కు చెందిన పురుషోత్తం వరుణ్‌కుమార్ ఇంజినీరింగ్ చదువుకున్నాడు. ఉద్యోగాన్వేషణలో ఉండగా.. రాజ్ కెసిరెడ్డి బృందం అతణ్నీ ఈ రొంపిలోకి దింపింది. మద్యం కుంభకోణంలో కీలక పాత్రధారిగా మార్చేసింది. లీలా డిస్టిలరీస్ అనే సంస్థను తన గుప్పిట్లో పెట్టుకున్న రాజ్ కెసిరెడ్డి ఆ సంస్థకు ఆంధ్రప్రదేశ్ ఇన్‌ఛార్జిగా పురుషోత్తం వరుణ్‌కుమార్‌ను నియమించారు. ఏపీఎస్‌బీసీఎల్ నుంచి ఆ సంస్థకు రూ.459 కోట్లు జమ కాగా.. ఆ సొమ్మంతా రకరకాల కంపెనీల ద్వారా మళ్లించారు. ఇలా ఈ కుంభకోణంలో పాత్రధారిగా మారిన వరుణ్‌కుమార్ ఇప్పుడు విదేశాలకు పారిపోయాడు.

*** సివిల్స్ ఆశావహుణ్ని.. అక్రమ సొమ్ముకు కాపలాదారును చేశారు**

కట్టా ప్రణోయ్ ప్రకాశ్.. డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రాపురానికి చెందిన ఈ యువకుడు ప్రతిష్ఠాత్మక మద్రాస్ ఐఐటీలో ఏరోస్పేస్ ఇంజినీరింగ్ పట్టా పొందారు. 2013 నుంచి 2016 వరకూ హైదరాబాద్‌లోనే ఉంటూ సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సన్నద్ధమయ్యారు. ఆయన తండ్రి.. ఇథియోపియా దేశంలోని పలు విశ్వవిద్యాలయాల్లో మార్కెటింగ్ అండ్ ఫైనాన్సింగ్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. ఈశ్వర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రణోయ్ ప్రకాశ్ నెల్లూరులో ఇంటర్మీడియట్ కలిసి చదువుకున్నారు. కిరణ్‌కుమార్‌రెడ్డికి, రాజ్ కెసిరెడ్డితో సన్నిహిత సంబంధాలున్నాయని తెలుసుకున్న ప్రణోయ్.. రాజ్‌కు చెప్పి ఏపీ ప్రభుత్వంలో తనకు ఏదైనా ఉద్యోగమిప్పించాలని కోరారు. దీంతో కిరణ్.. ప్రణోయ్‌ను ఈ రొచ్చులోకి దించాడు. ముడుపులు చెల్లించే కంపెనీల బ్రాండ్లే ప్రభుత్వ మద్యం దుకాణాల్లో విక్రయించేలా చూసే ఫీల్డ్ మానిటరింగ్ ప్రాజెక్ట్ బాధ్యతల్ని ప్రణోయ్‌కు అప్పగించాడు.

మద్యం డిస్టిలరీలు, సరఫరా కంపెనీల నుంచి వసూలు చేసిన ముడుపుల సొమ్ములో కొంత మొత్తాల్ని నిల్వ పెట్టడానికి తాడేపల్లి ప్యాలెస్ (జగన్ నివాసం) సమీపంలో ఓ ఫ్లాట్‌ను వైకాపా మద్యం ముఠా ప్రణోయ్ ప్రకాశ్‌తో అద్దెకు తీయించింది. రూ.వందల కోట్ల నోట్లకట్టల్ని అట్టపెట్టెల్లో తెచ్చి అక్కడ నిల్వ చేసేది. ఆ సొమ్ముకు ప్రణోయ్ కాపలాగా ఉండేవారు. సార్వత్రిక ఎన్నికలకు 6 నెలల ముందు నుంచి ఆ డబ్బును రాజ్ కెసిరెడ్డి, చెవిరెడ్డి భాస్కరరెడ్డి చెప్పినవారికి అందజేసేవారు. మద్యం కుంభకోణం దర్యాప్తు వేగవంతమవడంతో దుబాయ్ పారిపోయిన ప్రణోయ్ ఇటీవల స్వదేశానికి తిరిగొచ్చి ఈ విషయాలన్నీ సిట్ అధికారులకు చెప్పారు. న్యాయాధికారి ఎదుట వాంగ్మూలమూ ఇచ్చారు.

# లక్షకు పైగా ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్



హైదరాబాద్: రాష్ట్రంలో పనులు ప్రారంభమైన (గ్రౌండింగ్ అయిన) ఇందిరమ్మ ఇళ్ల సంఖ్య లక్ష దాటింది. ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని వేగంగా ముందుకు తీసుకెళ్లడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఈ మేరకు క్షేత్రస్థాయిలో ఇళ్ల నిర్మాణ పనులను లబ్ధిదారులు త్వరగా ప్రారంభించేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు. జీహెచ్ఎంసీ మినహాయించి రాష్ట్రవ్యాప్తంగా 32 జిల్లాల్లో 3,71,086 ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం కేటాయించింది. ఇందులో 2,78,134 ఇళ్లకు అనుమతులు ఇచ్చింది. వీటిలో ఇంతవరకు 1,00,264 ఇళ్లకు సంబంధించి పనులు ప్రారంభమయ్యాయి. గ్రౌండింగ్ అయినవాటిలో 13,362 పునాదుల వరకు, 2,890 గోడల వరకు, 886 శ్లాబ్ వరకు పూర్తయ్యాయి. మిగతావాటి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఇంతవరకు రంగారెడ్డి, ఖమ్మం, మహబూబ్‌నగర్, సూర్యాపేట జిల్లాల్లో ఒక్కో ఇల్లు చొప్పున రాష్ట్రంలో మొత్తం 4 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. వచ్చే పక్షం రోజుల్లో మంజూరుచేసిన అన్ని ఇళ్లు గ్రౌండింగ్ అయ్యేలా హౌసింగ్‌శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. మొత్తం అనుమతులిచ్చిన ఇళ్లలో ఎంపీడీవో లాగిన్లకు 3,21,094 వచ్చాయి. ఇందులో 2,78,134 ఇళ్లకు జిల్లా కలెక్టర్లు అనుమతులు ఇచ్చారు.

# డ్రగ్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలి

*** మేడిపల్లి పోలీస్ ఇన్స్పెక్టర్ గోవింద రెడ్డి**



మేడిపల్లి, (ప్రజాస్ఫూర్తి) : డ్రగ్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని మేడిపల్లి పోలీస్ ఇన్స్పెక్టర్ గోవింద రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మత్తు పదార్థాల నినాదమే లక్ష్యంగా ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర సాధనలో భాగంగా, మాదకద్రవ్యాల వ్యతిరేక ,నిర్మూలన అవగాహన వారోత్సవాలు 2025 ముగింపు లో భాగంగా గురువారం మేడిపల్లి పోలీసుల ఆధ్వర్యంలో డ్రగ్స్ మాదకద్రవ్యాల వ్యతిరేక, నిర్మూలన ర్యాలీని ఆయన పాల్గొని ప్రారంభించారు. ఈ ర్యాలీలో నల్ల మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల , స్కూలు విద్యార్థినీ ,విద్యార్థులు పాల్గొని కొర్రముల చౌరస్తా, నారపల్లి నుండి వరంగల్ జాతీయ రహదారి మీదుగా దివ్య నగర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు డ్రగ్ మహమ్మారిని తరిమికొట్టాలని, మత్తు పదార్థాల జోలికి విద్యార్థులు వెళ్లకూడదని తెలిపారు. ఎవరైనా మత్తు పదార్థాలు , మాదకద్రవ్యాలు డ్రగ్స్ ,అమ్ముతున్న, సేవిస్తున్న వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. తమకు తెలిసిన వాళ్లలో స్నేహితులు ఎవరైనా మత్తు ప దార్థాలకు బానిసలు అయితే వారి గురించి పోలీసు వారి దృష్టికి తీసుకువస్తే వారిపైన ఎటువంటి కేసులు లేకుండా కౌన్సిలింగ్ ద్వారా నిర్వహించి వారిని వ్యసనాల బారిన పడకుండా, వ్యసనాల నుంచి దూరం చేసే విధంగా పోలీసులు కృషి చేస్తారని తెలియపరిచారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన డ్రగ్స్ రహిత సమాజ సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై తమ వంతు పాత్ర నిర్వహించాలన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డీఐ బాలస్వామి, ఎస్ఐలు, సిబ్బంది ,నల్ల మల్లా రెడ్డి కాలేజీ డైరెక్టర్ దివ్య , విద్యార్థిని విద్యార్థులు దాదాపు 1000 మంది పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన మౌలిక వసతులను కల్పించేందుకు కృషి

*** టిపిసిసి ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్**



బోడుప్పల్, (ప్రజాస్ఫూర్తి) : ప్రజలకు మెరుగైన మౌలిక వసతులను కల్పించేందుకు కృషి చేస్తానని మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్, టిపిసిసి ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. మేడ్చల్ నియోజకవర్గం, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో హెచ్ ఎం డి ఎ రోడ్డు పనులకు రూ.24 కోట్లతో పలు అభివృద్ధి పనులకు ఆయనతో పాటు బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగుల నర్సింహారెడ్డి , బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, సీనియర్ నాయకులు.మాజీ కార్పొరేటర్లు, కాంటెస్ట్ కార్పొరేటర్లు.కాలనీ అధ్యక్షులు పాల్గొని శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహం నుండి చిలుక నగర్ వరకు 12 కోట్లు , బంగారు మైసమ్మ దేవాలయం నుండి చెంగిచర్ల ఓల్డ్ విలేజ్ వరకు, హెచ్.ఎం డి.ఎ నుండి రాచెరువు అభివృధి పనుల కొరకు 5 కోట్లు, హెచ్.ఎం డి.ఎ పార్క్ అభివృద్ధి కొరకు వీరా రెడ్డి నగర్ కాలనీ, లక్ష్మి నగర్ కాలనీ, చెంగిచర్ల ఓల్డ్ విలేజ్ 2.5 కోట్లు , సి డి ఎం ఎ నుండి 3.45 కోట్లు కట్టమైసమ్మ నుండి సుద్దకుంట వరకు పనులకు గాను, ప్రభుత్వం నుండి నిధులు మంజూరు అయిన సందర్భంగా ప్రభుత్వం నుండి ఈయొక్క నిధుల సమీకరణ లో ముఖ్య పాత్ర వహించిన బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ కి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, మహిళ నాయకురాలు . యూత్ నాయకులు.అభిమానులు. తదితరులు పాల్గొన్నారు.

## యాదవులందరూ ఐక్యంగా ఉండి యాదవ జాతి అభివృద్ధికి తోడ్పడాలి

*** రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చింతల రవీందర్ యాదవ్, జెకె శేఖర్ యాదవ్ లు**




నాగోల్ , (ప్రజాస్ఫూర్తి) : యాదవులందరూ ఐక్యంగా ఉండి యాదవ జాతి అభివృద్ధికి తోడ్పడాలని రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చింతల రవీందర్ యాదవ్, జెకె శేఖర్ యాదవ్ లు అన్నారు. గురువారం అఖిల భారత యాదవ మహా సభ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మీటింగ్ నాగోల్ లోని శుభం కన్వెన్షన్ లో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడుతూ రాబోయే స్థానిక ఎన్నికల్లో యాదవులకు, కురుమలకు సంఖ్యాపరంగా అన్ని పార్టీలు సీట్లు కేటాయించాలన్నారు. ఎన్ని రోజులు ఓట్లు మనయి,సీట్లు వాళ్లయి ఇప్పుడు మన సీట్లు మనకు ఇవ్వలి మన ఓట్లు మనమే వేసుకోవాలన్నారు. ఇచ్చేంతవరకు పోరాటం చేయాలన్నారు. యాదవులు విద్యాపరంగా ఆర్థికంగా రాజకీయంగా ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో. జాతీయ ఉపాధ్యక్షులు బత్తుల బాబురావు యాదవ్, జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మణ్ యాదవ్, రాష్ట్ర కార్యవర్గము, 33 జిల్లాల అధ్యక్షులు , యాదవ సభ్యులు పాల్గొన్నారు.

## ఆమరణ నిరాహార దీక్షకు దిగుతా

**: బీఆర్ఎస్ నేత ప్రకటన**

'కాంగ్రెస్‌కు ఓట్లు, సీట్లు ఇవ్వనంత మాత్రాన ఉమ్మడి రంగారెడ్డి జిల్లాను సీఎం రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యం చేస్తారా? మా జిల్లా రైతులంటే ఎందుకంత చిన్నచూపు' అని బీఆర్ఎస్ నేత పటోళ్ల కార్తీక్ రెడ్డి ప్రశ్నించారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డికి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అనేది ఒకటి ఉన్నదనేది తెలుసా అని నిలదీశారు. హర్యానాలో గుర్గావ్ జిల్లా తర్వాత ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనే తలసరి ఆదాయం ఎక్కువగా ఉందని.. దేశానికి అత్యధిక ఆదాయం తెచ్చిపెట్టే ఐదు జిల్లాల్లో ఈ జిల్లా ఒకటని గుర్తుచేశారు. ఈ జిల్లా రైతులకు రైతుభరోసా నిధులు ఎందుకు జమ చేయడం లేదని ప్రశ్నించారు. రంగారెడ్డి జిల్లా తెలంగాణలో లేదా అని నిలదీశారు. వారం రోజుల్లో రైతుబంధు నిధులు రంగారెడ్డి జిల్లా రైతుల అకౌంట్లలో పడక పోతే తాను ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని స్పష్టం చేశారు.

## డ్రగ్స్ వంటి మహమ్మారిని సమాజం నుండి తొలగించేందుకు ప్రతి ఒక్కరూ సైనికులా పని చేయాలి

**: ఎమ్మెల్యే కూనంనేని**





ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: అంతర్జాతీయ మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీసులు కొత్తగూడెం రైల్వే స్టేషన్ నుండి కొత్తగూడెం క్లబ్ వరకు భారీ ర్యాలీని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కొత్తగూడెం క్లబ్ లో భారీ సంఖ్యలో పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులు మరియు స్థానికులను ఉద్దేశించి సమావేశాన్ని ఏర్పాటుచేసి మాదకద్రవ్యాల వలన కలిగే అనర్ధాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఎస్పీ రోహిత్ రాజు ,జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణ గౌడ్,ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానయ్య , ఇతర అధికారులు పాల్గొన్నారు.అదేవిధంగా కొత్తగూడెం పట్టణ,పరిసర ప్రాంతాల్లోని వివిధ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ముందుగా జిల్లా ఎస్పీ మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే చెడు పరిణామాలను గుర్తించాలని, గంజాయి, డ్రగ్స్ బారినపడి యువత తమ అమూల్యమైన జీవితాలను కోల్పోతున్నారని అన్నారు. యువత మంచి లక్ష్యాలను పెట్టుకొని వాటిని సాకారం చేసుకునే దిశగా అడుగులు వేయలే కానీ డ్రగ్స్ కు బానిసలుగా మారకూడదని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను డ్రగ్ ఫ్రీ జిల్లా గా మార్చడంలో కృషి చేస్తున్న మన జిల్లా పోలీసు శాఖ కృషి అభినందనీయం అని తెలిపారు.ఈ రోజు యాంటీ డ్రగ్ డే సందర్భంగా ర్యాలీకి హాజరైయన వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులు డ్రగ్స్ మానేయండి... జీవితానికి అవును నినాదంతో ప్రతిజ్ఞ చేస్తూ.. మీ చుట్టూ ప్రక్కల ఉన్న వారికి అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమాన్ని ఇంత ఘనంగా ఏర్పాటు చేసిన కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు. గంజాయి లాంటి మహమ్మారిని నిర్మూలించడంలో దేశంలోనే నెంబర్ వన్ గా మన జిల్లా నిలుస్తుందని ఈ సందర్భంగా గుర్తుచేశారు..అనంతరం ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ యాంటీ డ్రగ్ సోల్జర్ గా ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పి రెహమాన్,ఎక్సైజ్ డిఎస్పీ కరంచంద్,జిల్లా సంక్షేమ అధికారిని లెనినా కుమారి, కొత్తగూడెం ఎఫ్ డి ఓ కోటేశ్వరరావు,కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీస్ అధికారులు,ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలిగించే వ్యక్తులపై కఠిన చర్యలు

*** భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్**





ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాచలం పట్టణ పరిసర ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులను ఉపేక్షించేది లేదని భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఒక ప్రకటనలో వెల్లడించారు. గంజాయి,మద్యం,డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు బానిసలై కొంతమంది యువత సామాన్య ప్రజానీకానికి ఇబ్బందులు కలిగించే విధంగా ప్రవర్తిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు.ఇకపై భద్రాచలం పట్టణంలో పోలీసు వారు అనుమానిత ప్రాంతాల్లో,గంజాయి హాట్స్పాట్స్ గా గుర్తించిన ప్రదేశాలలో ఆకస్మిక తనిఖీలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు.భద్రాచలం మీదుగా వివిధ ప్రాంతాల నుండి ఎలాంటి నిషేధిత పదార్థాలు తరలి వెళ్లకుండా పగలు,రాత్రి తేడా లేకుండా పోలీసులు వాహన తనిఖీలు చేపట్టడం జరుగుతుందని అన్నారు.భద్రాచలం పట్టణ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా ఆకతాయిలు గంజాయి సేవిస్తున్నట్లు గానీ,రవాణా చేస్తున్నట్లు గానే సమాచారం తెలిస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలని కోరారు.ఇందులో భాగంగానే నిన్న రాత్రి సమయంలో ఏఎస్పీ భద్రాచలం పట్టణంలో విస్తృత తనిఖీలు చేపట్టారు.

## నిరూపయోగంగా ఉన్న వస్తువుల వేలం పాట



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ శాఖలోని వివిధ విభాగాలకు సంబందించి నిరూపయోగంగా ఉన్న వస్తువులను గురువారం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ హేమచంద్రాపురం లో బహిరంగ వేలం పాట ద్వారా విక్రయించడం జరిగింది.ఈ వేలంపాటలో కంప్యూటర్ మానిటర్లు,సిపియు లు, కీబోర్డులు,మౌస్లు,యుపిఎస్ లు,ట్యాబ్ లు,యాపిల్ ఐ ప్యాడ్ లు,ఇన్వర్టర్ , ఇన్వర్టర్ బ్యాటరీలు,డ్రాగన్ లైట్లు,టార్చ్ లైట్లు, క్లోత్ టెంట్లు, టేబుళ్లు, కుర్చీలు, బీరువాలతో పాటు ఇతర ఫర్నీచర్ సామాగ్రిని , ఇతర వస్తువులకు వేలంపాట నిర్వహించారు.ఇట్టి వేలంపాటకు సంబంధించి జిల్లా ఎస్పీ సూచనల మేరకు ఒక కమిటీని నియమించడం జరిగింది.కమిటీ చైర్మన్ గా డిఎస్పీ మల్లయ్య స్వామి,సభ్యులుగా ఏఆర్ డిఎస్పీ సత్యనారాయణ,ఏవో మంజ్యా నాయక్, ఆర్ఐ అడ్మిన్ లాల్ బాబు,ఆర్ఐ వెల్ఫేర్ కృష్ణారావు,కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు లు నియామతులయ్యారు.ఈ కమిటీ సమక్షంలో జరిగిన ఈ బహిరంగ వేలంపాటలో అన్ని వస్తువులను రూ.3,07,100లకు ఆసక్తి గల సభ్యులు చేజెక్కించుకోవడం జరిగిందని తెలిపారు.

## శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో వైభవ పేతంగా వారాహి నవరాత్రులు



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి నిజాంపేటలో వెలసినటువంటి శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో గురువారం నుంచి పది రోజులు వారాహి నవరాత్రులు అత్యంత వైభవ పేతముగా ప్రారంభమయ్యాయి. పూజా కార్యక్రమాన్ని దీపప్రజనులతో ప్రారంభం చేసి అమ్మవారి మూలమంత్ర హోమాలజులతో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కొలన్ తేజ శ్రీనివాస్ రెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమ్మవారి దగ్గర గ్రామ ప్రజలందరూ క్షేమంగా ఉండాలన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు సత్యం స్వామి వారి ఆధ్వర్యంలో వేదమూల మంత్ర హోమాదులు జరిగాయి. ఈ కార్యక్రమంలో భక్తులు వేలాదిగా పాల్గొన్నారు.

## మత్తు పదార్థాల వినియోగంతో జీవితం అంధకారం

*** అదనపు సీనియర్ సివిల్ జడ్జి కె. కవిత**




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: మత్తు పదార్థాల వినియోగంతో జీవితం అంధకారం అవుతుందని, డ్రగ్స్, గంజాయి వంటి వాటికి యువత,విద్యార్థులు దూరంగా ఉండాలని అదనపు సీనియర్ సివిల్ జడ్జి కె.కవిత అన్నారు. కొత్తగూడెం లో ఉన్న శ్రీ రామచంద్ర ఆర్ట్స్ , సైన్స్ డిగ్రీ కళాశాలలో గురువారం అంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగ జరిగిన న్యాయ చైతన్య కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. యువతకు బాధ కలిగినప్పుడు మత్తు పదార్థాలకు అలవాటు పడి దాన్ని వ్యసనంగా మార్చుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగ ఉంటూ ఆరోగ్యకరమైన జీవితం గడపాలని సూచించారు. విద్యార్థి దశలో క్రమశిక్షణ కలిగి చెడు అలవాటుకు దూరంగా ఉండాలని తెలిపారు. డ్రగ్స్ వినియోగం సమాజంలో అతిపెద్ద సమస్యగ మారిందని ముఖ్యంగ యువత వాటి భారిన పడకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తన నిశితంగా పరిశీలిస్తుండాలని కోరారు. కార్యక్రమం అనంతరం న్యాయమూర్తి విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వి.పురుషోత్తమరావు, డిప్యూటీ కౌన్సిల్ పి.నిరంజన్ రావు, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్స్ సాహితీ, పావని, కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పి. పద్మ, డి.రమేష్, వైస్ ప్రిన్సిపల్ డా. ఎం.పూర్ణ, యాంటీ డ్రగ్స్ కమిటీ కన్వీనర్ చందర్ రావు, డా.ఎన్. శ్రీదేవి, పి. శ్రీనివాసరావు, న్యాయవాదులు ఎండి సాధిక్ పాషా, మారపాక రమేష్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బీసీ చేతి వృత్తుల ఎగ్జిబిషన్



బీ సీ సంక్షేమ శాఖ చరిత్రలోనే మొదటిసారిగా ఏర్పాటు చేసిన బీసీ చేతివృత్తుల కళాకారుల ఉత్పత్తుల ప్రదర్శనను హైదరాబాద్‌లో ఏర్పాటు చేశారు. గురువారం ఉన్నతాధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, బీసీ సంఘాల నాయకులు సందర్శించారు. బీసీ చేతివృత్తులవారికి చేయూత ఇచ్చేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్ బాగుందని ప్రశంసించారు. బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్, మాజీ మంత్రి, కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు కే.పుష్పలీల, ఇంటలిజెన్స్ డీఐజీ బి.సుమతి, ఐపీఎస్, బీసీ సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ పద్మ, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీఎస్ రాములు, మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చింతల నిర్మలా రెడ్డి తదితరులు బీసీ చేతివృత్తుల ప్రదర్శనకు విచ్చేశారు.

# ఆ తర్వాత ముఖ్యమంత్రి అయ్యేందుకు ప్రయత్నిస్తా: జగ్గారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు

* **ఈ మూడేళ్లు రేవంత్ రెడ్డే ముఖ్యమంత్రిగా కొనసాగుతారన్న జగ్గారెడ్డి**
* **మరో ఐదేళ్లు కూడా సీఎం అయ్యేందుకు రేవంత్ ప్రయత్నిస్తున్నారని వెల్లడి**
* **తొమ్మిదేళ్ల తర్వాత తాను సీఎం అయ్యేందుకు కృషి చేస్తానన్న జగ్గారెడ్డి**
* **బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో మండిపాటు**



* **లిక్కర్ స్కాంలో వందల కోట్లు కవితకు ఎక్కడివి అని ప్రశ్న**

తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి రాష్ట్ర రాజకీయాల్లో ఒక ఆసక్తికరమైన చర్చకు తెరలేపారు. ముఖ్యమంత్రి పదవిపై తన ఆకాంక్షను పరోక్షంగా వెల్లడిస్తూనే, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. గురువారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

**సీఎం పదవిపై జగ్గారెడ్డి మనోగతం**

ముఖ్యమంత్రి పదవి గురించి జగ్గారెడ్డి మాట్లాడుతూ, వచ్చే మూడేళ్లు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉంటారని, ఆ తర్వాత ఐదేళ్ల కాలానికి కూడా ముఖ్యమంత్రి కావడానికి ఆయన ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. అయితే, రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పదవి నుంచి దిగిపోయిన తర్వాత తానూ ముఖ్యమంత్రి అయ్యేందుకు ప్రయత్నిస్తానని జగ్గారెడ్డి పేర్కొన్నారు. ఆ సమయంలో తన అభ్యర్థిత్వాన్ని ప్రజల ముందు ఉంచుతానని ఆయన వ్యాఖ్యానించారు.

**కవిత వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం**

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేస్తున్న వ్యాఖ్యలపై జగ్గారెడ్డి తీవ్రంగా స్పందించారు. కవిత ప్రతి విషయాన్ని అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఆమె బీఆర్ఎస్‌లో ఉన్నా బయటకు వచ్చినా పెద్ద తేడా ఏమీ ఉండదని అన్నారు. కవిత మాట్లాడే మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉన్నాయని విమర్శించారు. సాధారణంగా తండ్రి రాజకీయ వారసత్వం కుమారుడికి వస్తుందని, ఒకవేళ కుమారుడు లేకపోతే కుమార్తెకు అవకాశం దక్కవచ్చని వ్యాఖ్యానించారు. తాము స్పందించే స్థాయి నాయకురాలు కవిత కాదన్నది తమ అభిప్రాయమని జగ్గారెడ్డి అన్నారు. కవిత ఎందుకు ఇంత పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సమాన ప్రాధాన్యత కలిగిన నేతలని, వారు రాజకీయంగా ఒకరినొకరు విమర్శించుకుంటే అర్థం ఉంటుందని తెలిపారు. తమ గురించి కవిత అనవసరంగా ఎందుకు మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. "హాయిగా బతుకమ్మ ఆడుకోకుండా కవితకు ఈ పంచాయితీ ఎందుకు?" అని నిలదీశారు. ఢిల్లీ మద్యం కుంభకోణం వ్యవహారంలో కవిత ప్రమేయంపై జగ్గారెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ స్కాంలో పెట్టుబడులు పెట్టడానికి కవితకు ఇన్ని వందల కోట్ల రూపాయలు ఎక్కడి నుంచి వచ్చాయని ఆయన ప్రశ్నల వర్షం కురిపించారు.

## మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు భద్రత పెంపు

హైదరాబాద్: మెదక్ భాజపా ఎంపీ రఘునందన్‌రావుకు భద్రత పెంచాలని పోలీసు శాఖ నిర్ణయించింది. ఇటీవలే రఘునందన్‌రావుకు మావోయిస్టుల నుంచి బెదిరింపు కాల్ వచ్చిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ చేపట్టిన పోలీసు శాఖ మెదక్ ఎంపీకి భద్రత అవసరమని నిర్ధారణకు వచ్చింది. ఇకపై రఘునందన్‌రావు పర్యటనలో ఎస్కార్ట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈమేరకు మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ముగ్గురు ఎస్పీలకు ఆదేశాలు జారీ అయ్యాయి. రఘునందన్‌రావుకు పీపుల్స్‌వార్ మావోయిస్టు పేరుతో బెదిరింపు కాల్ వచ్చింది. సోమవారం సాయంత్రంలోగా చంపుతామంటూ ఆగంతకుడు ఫోన్ చేశాడు. తాను మధ్యప్రదేశ్‌కు చెందిన మావోయిస్టునంటూ



బెదిరించాడు. మేడ్చల్ జిల్లా దమ్మాయిగూడలో ఓ ప్రైవేటు పాఠశాల కార్యక్రమానికి ఎంపీ హాజరైన సమయంలో ఈ ఘటన జరిగింది. ఈ ఫోన్‌కాల్‌ను రఘునందన్ పీఏ లిఫ్ట్ చేశారు. బెదిరింపు కాల్‌పై డీజీపీ, మెదక్ జిల్లా ఎస్పీ, ఇతర ఉన్నతాధికారులకు రఘునందన్‌రావు ఫిర్యాదు చేశారు.

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై పరువు నష్టం కేసు హైకోర్టులో విచారణ వాయిదా

* **కేసు కొట్టివేయాలని హైకోర్టును ఆశ్రయించిన రేవంత్**
* **లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో బీజేపీపై వ్యాఖ్యల వివాదం**
* **పీసీసీ అధ్యక్షుడి హోదాలో రాజకీయ ప్రసంగమేనన్న న్యాయవాది**
* **తదుపరి విచారణను జూలై 2కు వాయిదా వేసిన హైకోర్టు**

ప్రజాప్రతినిధుల కోర్టులో తనపై నమోదైన పరువు నష్టం కేసును కొట్టివేయాలని కోరుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దాఖలు



చేసిన పిటిషన్‌పై గురువారం హైకోర్టులో విచారణ జరిగింది. ఈ కేసుకు సంబంధించిన తదుపరి విచారణను జూలై 2వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ కె.లక్ష్మణ్ నేతృత్వంలోని ధర్మాసనం ప్రకటించింది. గత లోక్‌సభ ఎన్నికల ప్రచార సమయంలో రేవంత్‌రెడ్డి బీజేపీ పరువుకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ వాసం వెంకటేశ్వర్లు ప్రజాప్రతినిధుల కోర్టులో క్రిమినల్ డిఫమేషన్ కేసు దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో, కింది కోర్టులో తనపై నమోదైన కేసును రద్దు చేయాలని అభ్యర్థిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. రేవంత్ రెడ్డి తరపు న్యాయవాది హైకోర్టులో వాదనలు వినిపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బహిరంగ సభలో రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడి హోదాలో ప్రసంగించారని, అది కేవలం రాజకీయపరమైన ప్రసంగం మాత్రమేనని కోర్టుకు తెలిపారు. ఈ వ్యాఖ్యలను వ్యక్తిగత దూషణగా పరిగణించరాదని, అందువల్ల ఈ కేసును కొట్టివేయాలని అభ్యర్థించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, తదుపరి విచారణను జూలై 2వ తేదీకి వాయిదా వేసింది.

## ఆర్టీఏ కార్యాలయాల్లో ఏసీబీ సోదాలు

హైదరాబాద్: తెలంగాణ వ్యాప్తంగా ఆర్టీఏ కార్యాలయాల్లో ఏసీబీ సోదాలు చేస్తోంది. హైదరాబాద్ నగరంతో పాటు పెద్దపల్లి తదితర ప్రాంతాల్లో అధికారులు తనిఖీలు చేస్తున్నారు. హైదరాబాద్‌లోని ఉప్పల్, తిరుమలగిరి, మన్నెగూడలో సోదాలు కొనసాగుతున్నాయి. హైదరాబాద్ ఏసీబీ డీఎస్పీ శ్రీధర్, రంగారెడ్డి జిల్లా డీఎస్పీ ఆనంద్ ఆధ్వర్యంలో అధికారులు పలు పత్రాలను పరిశీలిస్తున్నారు. తిరుమలగిరిలో ఇద్దరు క్లర్క్‌లతో పాటు 10 మంది ఏజెంట్లను పట్టుకున్నారు. కార్యాలయం తలుపులు మూసివేసి తనిఖీలు చేస్తున్నారు. ఉప్పల్‌లో 10 మంది ఏజెంట్లను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు.

### తల్లిని గెంటేసిన కుమారులు..

## ఇంటిని సీజ్ చేసిన రెవెన్యూ అధికారులు

హైదరాబాద్: తల్లిని గెంటేసిన కుమారుల తీరును రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. రెండ్రోజుల్లో ఇల్లు ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేసినా స్పందించకపోవడంతో రెవెన్యూ అధికారులు ఆ ఇంటిని సీజ్ చేశారు. ఈ ఘటన మలక్‌పేట మూసారాంబాగ్‌లో జరిగింది. మూసారాంబాగ్‌కు చెందిన శకుంతలా బాయి(90)కి ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు సంతానం. ఆమె భర్త చాలా ఏళ్ల క్రితమే మృతి చెందారు. అప్పటి నుంచి తన నివాసంలో కొడుకుల వద్ద ఉండేది. కానీ, తల్లి ఆలనాపాలనా చూడాల్సిన ఇద్దరు కుమారులు నిర్లక్ష్యం చేస్తూ బలవంతంగా బయటకు వెళ్లగొట్టారు. దిక్కుతోచని ఆ వృద్ధురాలు సైదాబాద్‌లోని చిన్న కుమార్తె వద్ద ఉంటోంది. బాగోగులు చూడని కుమారులు ఇంట్లో ఉండొద్దని, తన ఇల్లు స్వాధీనం చేయాలని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి శకుంతలాబాయి హైదరాబాద్ జిల్లా ఆర్డీవోను 2024 ఫిబ్రవరిలో ఆశ్రయించింది. ఆర్డీవో ఇద్దరు కుమారులను పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఇంటిని తల్లికి అప్పగిస్తామని అంగీకరించారు. కానీ నెలలు గడుస్తున్నా ఇంటిని ఖాళీ చేయలేదు. సైదాబాద్ తహశీల్దార్ జయశ్రీ మూడు రోజుల క్రితం బాధితురాలి కుమారులకు ఫైనల్ నోటీస్ జారీ చేశారు. రెండ్రోజుల్లో ఇల్లు ఖాళీ



చేయక పోతే సీజ్ చేస్తామని హెచ్చరించారు. గడువు ముగియడంతో సిబ్బందితో తహశీల్దార్ రాగా అప్పటికే కుమారులు ఇంటికి తాళం వేసి వెళ్లిపోయారు. వెంటనే రెవెన్యూ సిబ్బంది ఆ ఇంటిని సీజ్ చేశారు.




## తెలంగాణలో 3 రోజుల పాటు వర్షాలు.. ఎల్లో హెచ్చరికలు జారీ

హైదరాబాద్: ఉపరితల ఆవర్తనం ప్రభావంతో వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడినట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఇది పశ్చిమ వాయువ్య దిశలో కదిలి ఉత్తర ఒడిశా దాని సమీపంలోని ఛత్తీస్‌గఢ్‌ల మీదుగా కదిలే అవకాశం ఉందని తెలిపింది. వాయువ్య అరేబియన్ సముద్ర తీర ప్రాంతం నుంచి ద్రోణి ఒకటి దక్షిణ గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ మీదుగా వాయువ్య బంగాళాఖాతంలోని అల్పపీడన ప్రాంతం వరకు సగటు సముద్ర మట్టం నుంచి 1.5 7.6 కి.మీ మధ్యలో ఏర్పడిందని వెల్లడించింది. అల్పపీడనం ప్రభావంతో తెలంగాణలో 3 రోజుల పాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. గంటకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. ఇవాళ ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ మూడు రోజుల పాటు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది.

## ఉద్యోగులు, పెన్షనర్లకు తెలంగాణ సర్కార్ తీపికబురు

* **పాత, కొత్త మెడికల్ బిల్లులకు మోక్షం.. రూ.180 కోట్లు విడుదల**
* **నిధుల విడుదలకు ఆమోదం తెలిపిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**
* **సుమారు 26,519 మందికి ప్రయోజనం చేకూరనుందని వెల్లడి**
* **ప్రభుత్వ నిర్ణయంపై ఉద్యోగ, పెన్షనర్ల సంఘాల హర్షం**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఓ



శుభవార్త అందించింది. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులకు సంబంధించిన నిధులను విడుదల చేసింది. మొత్తం రూ.180.30 కోట్ల విలువైన వైద్య బిల్లుల బకాయిలకు సంబంధించి నిధులు విడుదల చేసినట్లు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 26,519 మంది ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఉపశమనం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రం తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నప్పటికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులు మరియు పెన్షనర్ల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈ నిధులను విడుదల చేసినట్లు భట్టి విక్రమార్క వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేరుకుపోయిన బకాయిలతో పాటు, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న వైద్య బిల్లులను కూడా ప్రస్తుత ప్రభుత్వం విడుదల చేయడం గమనార్హం. ఈ పెండింగ్ బకాయిలను విడుదల చేయడం పట్ల ఉద్యోగ, పెన్షనర్ల సంఘాల నాయకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వారు స్వాగతించారు. ఈ చర్య ఉద్యోగులు, పెన్షనర్ల సంక్షేమం పట్ల ప్రభుత్వ నిబద్ధతను తెలియజేస్తోందని వారు అభిప్రాయపడ్డారు.

## గుజరాత్‌కు బుల్లెట్ ట్రైన్.. తెలంగాణకు మెట్రో ట్రైన్ ఇవ్వలేరా? : కేటీఆర్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ మెట్రో 2nd ఫేజ్ విస్తరణపై కేంద్ర ప్రభుత్వం విస్మరించడం పట్ల నరేంద్ర మోడీ ప్రభుత్వంపై ఫైర్ అయ్యారు. రూ.2 లక్షల కోట్లు ఖర్చుతో గుజరాత్‌కు బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు మంజూరు చేసినపుడు, తెలంగాణకు కనీసం మెట్రో ట్రైన్ ప్రాజెక్టు కూడా ఇవ్వలేరా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వంలో తెలంగాణ నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులున్నారని, పార్లమెంటులో 8 మంది ఎంపీలు ఉన్నారని.. మరి వీరంతా ఏం చేస్తున్నట్టని ప్రశ్నించారు. వీరంతా తెలంగాణ అభివృద్ధి కోసం, ప్రాజెక్టుల కోసం పని చేయాల్సింది పోయి, ఎవరికి ఊడిగం చేస్తున్నారని నిలదీశారు. కాగా బుధవారం జరిగిన కేంద్ర కేబినెట్ లో హైదరాబాద్ మెట్రో 2వ దశ నిర్మాణ పనులకు ఎలాంటి అనుమతులు రాని విషయం తెలిసిందే.

# క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ అభిప్రాయం తెలపండి: మంత్రి నాదెండ్ల

* రేషన్ డిపోల వద్ద క్యూఆర్ కోడ్ పోస్టర్ల ఏర్పాటు
* స్కాన్ చేసి సరుకులు, డీలర్లపై ఫీడ్‌బ్యాక్ ఇవ్వొచ్చు
* 65 ఏళ్లు పైబడినవారు, దివ్యాంగులకు ఇంటికే రేషన్ సౌకర్యం
* ఈనెల 26 నుంచే జులై నెల సరుకుల పంపిణీ ప్రారంభం
* నూతన విధానాలు వెల్లడించిన మంత్రి నాదెండ్ల మనోహర్



రాష్ట్ర ప్రజలకు మరింత మెరుగైన, పారదర్శకమైన సేవలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల మరియు వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. రేషన్ పంపిణీ వ్యవస్థలో పలు కీలక సంస్కరణలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా వినియోగదారుల అభిప్రాయాలు, ఫిర్యాదులను నేరుగా స్వీకరించేందుకు వీలుగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని రేషన్ డిపోల వద్ద క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఏర్పాటు చేసినట్లు మంత్రి వెల్లడించారు.

*** క్యూఆర్ కోడ్‌తో నేరుగా మీ స్పందన**

రేషన్ కార్డుదారులు తమ స్మార్ట్‌ఫోన్లతో ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా ఒక వెబ్ ఫారమ్‌లోకి ప్రవేశిస్తారని మంత్రి నాదెండ్ల వివరించారు. ఈ ఫారమ్‌లో ఆ నెల రేషన్ సరుకులు అందుకున్నారా? లేదా? సరుకుల నాణ్యత ఎలా ఉంది? తూకంలో ఏమైనా తేడాలున్నాయా? రేషన్ డీలర్ ప్రవర్తన, ఏవైనా అధిక ధరలు వసూలు చేశారా? వంటి ప్రశ్నలకు "అవును" లేదా "కాదు" అనే సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. పౌరులు నమోదు చేసే ఈ వివరాలు, అభిప్రాయాలు నేరుగా ఉన్నతాధికారులకు చేరుతాయని, దీనివల్ల సమస్యలున్న చోట తక్షణమే చర్యలు తీసుకునేందుకు వీలు కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యం ద్వారానే పౌర సేవలను మరింత మెరుగుపరచాలన్నది మా ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా మంత్రి వెల్లడించారు.

*** వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యం**

మరో కీలక నిర్ణయంగా 65 ఏళ్లకు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే రేషన్ సరుకులు పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఇవాళ్టి నుంచే ప్రారంభించినట్లు మంత్రి నాదెండ్ల తెలిపారు. వీరికి ఐదు రోజుల ముందుగానే రేషన్ అందజేయనున్నట్లు చెప్పారు. అంతేకాకుండా జులై నెలకు సంబంధించిన రేషన్ సరుకుల పంపిణీని కూడా నేటి నుంచే రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభిస్తున్నట్లు ఆయన వివరించారు. గతంలో ఇంటింటికీ రేషన్ పేరిట మొబైల్ యూనిట్ల ద్వారా జరిగిన పంపిణీ విధానంతో పోలిస్తే, ప్రస్తుతం రేషన్ డిపోల ద్వారా జరుగుతున్న పంపిణీ వ్యవస్థ మెరుగైన ఫలితాలను ఇస్తోందని మంత్రి అభిప్రాయపడ్డారు. "ప్రజల అభిప్రాయాలే మాకు మార్గదర్శకం. ఈ నూతన వ్యవస్థలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై, సేవలను మరింత మెరుగుపరిచేందుకు సహకరించాలి" అని మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ విధానాల ద్వారా పంపిణీ వ్యవస్థలో జవాబుదారీతనం పెరుగుతుందని, ప్రజలకు నాణ్యమైన సేవలు అందుతాయని ప్రభుత్వం ఆశిస్తోంది.

# తిరుమల శ్రీవారి ప్రాణదాన ట్రస్టుకు ఎన్నారై భారీ విరాళం

* టీటీడీ ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు గూగుల్ వైస్ ప్రెసిడెంట్ తోట చంద్రశేఖర్ కోటి విరాళం
* టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుకు చెక్కు అందించిన ఎన్నారై తోట చంద్రశేఖర్
* తోట చంద్రశేఖర్‌ను అభినందించిన టీటీడీ ఛైర్మన్
* టీటీడీకి 2000 హెల్మెట్లు విరాళంగా ఇచ్చిన అమలాపురం వాసి సత్యనారాయణ



టీటీడీకి గురువారం భారీగా విరాళాలు అందాయి. ప్రముఖ టెక్నాలజీ సంస్థ గూగుల్ వైస్ ప్రెసిడెంట్, ఎన్నారై అయిన తోట చంద్రశేఖర్ టీటీడీ నిర్వహిస్తున్న ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు కోటి రూపాయల భారీ విరాళాన్ని అందించారు. మరోవైపు అమలాపురానికి చెందిన ఓ భక్తుడు పెద్ద సంఖ్యలో హెల్మెట్లను దేవస్థానానికి సమర్పించారు. గూగుల్ సంస్థలో కీలక పదవిలో ఉన్న తోట చంద్రశేఖర్, తిరుమల లోని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు తనవంతుగా కోటి రూపాయల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఇందుకు సంబంధించిన చెక్కును ఛైర్మన్ బీఆర్ నాయుడుకు అందజేశారు. తోట చంద్రశేఖర్ చూపిన ఈ దాతృత్వానికి టీటీడీ ఛైర్మన్ ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. ఎస్వీ ప్రాణదాన ట్రస్టు ద్వారా టీటీడీ అనేకమంది పేద రోగులకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్న విషయం తెలిసిందే. అలాగే తూర్పు గోదావరి జిల్లా అమలాపురానికి చెందిన నిమ్మకాయల సత్యనారాయణ అనే భక్తుడు టీటీడీకి తనవంతు సహాయం అందించారు. ఆయన సుమారు రూ. 15 లక్షల విలువ చేసే 2వేల హెల్మెట్లను టీటీడీకి విరాళంగా ఇచ్చారు. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడును కలిసి సత్యనారాయణ ఈ హెల్మెట్లను అందజేశారు. దేవస్థానం అవసరాలకు ఈ హెల్మెట్లు ఉపయోగ పడతాయని భావిస్తున్నారు.

## రాజమండ్రిలో 'అఖండ గోదావరి' పర్యాటక ప్రాజెక్ట్‌కు
# శంకుస్థాపన చేసిన షెకావత్, పవన్ కల్యాణ్

* రాజమండ్రిలో అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టు
* కేంద్రం రూ.375 కోట్లతో రాష్ట్రంలో చేపట్టనున్న పర్యాటక ప్రాజెక్టులు
* ప్రాజెక్టుల ఫోటో గ్యాలరీని తిలకించిన షెకావత్, పవన్
* గోదావరి రివర్ ఫ్రంట్ నుంచి ప్రాజెక్టు ప్రాంతం పరిశీలన
* హాజరైన రాష్ట్ర మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర నేతలు



రాజమండ్రిలో అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టు నిర్మాణానికి గురువారం అంకురార్పణ జరిగింది. కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమం గోదావరి తీర ప్రాంత అభివృద్ధిలో ఒక ముఖ్యమైన మైలురాయిగా భావిస్తున్నారు. శంకుస్థాపన కార్యక్రమం అనంతరం, కేంద్ర ప్రభుత్వం సమకూరుస్తున్న రూ.375 కోట్ల నిధులతో రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో చేపట్టనున్న వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన ఫోటో గ్యాలరీని గజేంద్ర సింగ్ షెకావత్, పవన్ కల్యాణ్ తిలకించారు. అనంతరం, గోదావరి తీరంలోని రివర్ ఫ్రంట్ వ్యూ పాయింట్ నుంచి అఖండ గోదావరి ప్రాజెక్టును నిర్మించ తలపెట్టిన ప్రాంతాన్ని వారు పరిశీలించారు. ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను అధికారులు వారికి వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా స్థానికంగా పర్యాటకం గణనీయంగా వృద్ధి చెందుతుందని, ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కందుల దుర్గేష్, నిమ్మల రామానాయుడు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పాల్గొన్నారు. వీరితో పాటు కూటమి ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి వాసు, గిడ్డి సత్యనారాయణ, మద్దిపాటి వెంకటరాజు, చిర్రి బాలరాజు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు కూడా హాజరయ్యారు. అలాగే, టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ నూకసాని బాలాజీ, రాజమండ్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) ఛైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి, జిల్లా కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ (డీసీసీబీ) ఛైర్మన్ తుమ్మల రామస్వామి, జిల్లా కలెక్టర్‌తో పాటు ఇతర జిల్లా అధికారులు, పర్యాటక శాఖ ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు.

# డ్రగ్స్ విక్రేతలపై ఉక్కుపాదం మోపుతున్నాం: విజయవాడ కమిషనర్

విజయవాడ: డ్రగ్స్ రహిత సమాజం కోసం శాయశక్తులా కృషి చేస్తున్నామని విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు స్పష్టం చేశారు. మాదక ద్రవ్యాలు సరఫరా చేసే, విక్రయించే వారిపై ఎన్డీపీఎస్ యాక్ట్ పెట్టి కటకటాల వెనక్కి పంపుతున్నామని చెప్పారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవంలో భాగంగా విజయవాడలోని ఇందిరా గాంధీ స్టేడియం నుంచి డీవీమ్యానర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు, వివిధ విద్యా సంస్థల విద్యార్థులు పాల్గొన్నారు.



డ్రగ్స్ మహమ్మారిని తరిమి కొడితేనే మంచి సమాజం సాధ్యమవుతుందని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. డ్రగ్స్ వల్ల కుటుంబాలు నాశనమవుతున్నాయని, ముఖ్యంగా యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డిపై కేసు.. ఎంపీపీ అరెస్ట్.. వైసీపీ నేతలకు చిక్కులు!

* మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డిపై బాణసంచా ఘటనలో కేసు
* 2024 ఎన్నికల ప్రచారంలో అపశ్రుతి, వ్యక్తి కంటికి గాయం
* లోకేశ్ అనే వ్యక్తి కంటిచూపు కోల్పోయిన వైనం
* శ్రీకాంత్ రెడ్డితో పాటు 19 మంది వైసీపీ నేతలపై ఎఫ్ఐఆర్
* ఎంపీపీ సుదర్శన్ రెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
* జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆదేశాలతో చర్యలు



అన్నమయ్య జిల్లాలో వైసీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డితో పాటు పలువురు ఆ పార్టీ నేతలపై కేసు నమోదైంది. 2024 ఎన్నికల ప్రచార సమయంలో బాణసంచా పేల్చడం వల్ల ఓ వ్యక్తి కంటిచూపు కోల్పోయిన ఘటనకు సంబంధించి ఈ కేసు నమోదు కాగా, ఓ నేతను పోలీసులు అదుపులోకి కూడా తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే... 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా వైసీపీ కార్యకర్తలు లక్కిరెడ్డిపల్లి మండలం అగ్రహారంలో భారీగా బాణసంచా కాల్చారు. ఈ క్రమంలో జరిగిన అపశ్రుతిలో లోకేశ్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడి, ఒక కన్నును కోల్పోయారు. ఈ ఘటనపై బాధితులు జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ)ను ఆశ్రయించారు. ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఆదేశాల మేరకు లక్కిరెడ్డిపల్లి పోలీసులు రంగంలోకి దిగి, బాధ్యులపై చర్యలు చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించి మొత్తం 19 మంది వైసీపీ నేతలపై కేసు నమోదు చేశారు. నిందితుల జాబితాలో మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, గడికోట రమేశ్‌రెడ్డి, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి తదితరులు ఉన్నారు. ఈరోజు ఉదయం ఎంపీపీ సుదర్శన్‌రెడ్డిని లక్కిరెడ్డిపల్లి ఇన్‌ఛార్జ్ సీఐ వరప్రసాద్ నేతృత్వంలోని పోలీసు బృందం అదుపులోకి తీసుకుంది. ఈ కేసులో మిగిలిన నిందితులపైనా చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్నికల సమయంలో జరిగిన ఈ సంఘటన, ఇప్పుడు వైసీపీ నేతలకు న్యాయపరమైన చిక్కులు తెచ్చిపెట్టింది.

# అమరావతిలో మౌలికసదుపాయాల కల్పనకు నిధులు మంజూరు

అమరావతి: రాజధాని అమరావతిలో ప్రభుత్వ కార్యాలయాల సముదాయ ప్రాంతం లే అవుట్‌లలో మౌలిక సదుపాయల కల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వం నిధులు ముంజూరు చేసింది. రూ.1052.67 కోట్ల మంజూరుకు పరిపాలనా అనుమతి జారీ చేస్తూ ఆదేశాలిచ్చింది. ఈ నిధులతో రోడ్లు, డ్రెయిన్‌లు, నీటి సరఫరా, మురుగునీటి పారుదల, విద్యుత్ సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సూచించింది. యుటిలిటీ డక్ట్‌లు, పునర్వినియోగ నీటిలైన్, అవెన్యూ ప్లాంటేషన్ నిర్మాణం తదితరాల ఏర్పాటు కోసం ఈ నిధులు వెచ్చించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని సీఆర్డీయే కమిషనర్‌ను ఆదేశిస్తూ పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.



## 'సుపరిపాలనలో తొలి అడుగు'
# కార్యక్రమంలో ఎమ్మెల్యేలకు అవమానం: రఘురామ

అమరావతి: 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఎమ్మెల్యేలకు అవమానం జరిగిందని ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు అన్నారు. కలెక్టర్ కంటే ఎమ్మెల్యే ప్రొటోకాల్ పెద్దదని చెప్పారు. ''కలెక్టర్, ఎస్పీ, ఎంపీని ఒక టేబుల్ వద్ద కూర్చోబెట్టారు. మరో టేబుల్ వద్ద కార్పొరేషన్ డైరెక్టర్లతో కలిపి ఎమ్మెల్యేలను కూర్చోబెట్టారు. ప్రభుత్వం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రొటోకాల్ నిబంధనలు పాటించలేదు. ప్రభుత్వ కార్యక్రమానికి స్పీకర్, డిప్యూటీ స్పీకర్‌ను కూడా ఆహ్వానించాలి. ఎమ్మెల్యేలకు జరిగిన అవమానంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)కి లేఖ రాస్తా. ఇది మొదటి తప్పుగా భావిస్తున్నా. కార్యక్రమానికి వెళ్లి ఉంటే సీటింగ్ విధానం చూసి బయటకు వచ్చేసేవాడిని. అవమానం జరిగిందని చాలా మంది ఎమ్మెల్యేలు నాతో చెప్పినందునే మాట్లాడుతున్నా. ప్రొటోకాల్ ఉల్లంఘన ప్రభుత్వ పెద్దలకు తెలిసే జరిగిందో.. లేదో నాకు తెలియదు'' అని రఘురామ వ్యాఖ్యానించారు.



# చైనా, పాక్, బంగ్లా.. కొత్త కూటమి ఏర్పాటు చేస్తున్నాయా?




చైనా, పాకిస్థాన్‌లతో సంబంధాలను మరింత బలోపేతం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్న బంగ్లాదేశ్ ప్రతినిధులు ఇటీవల ఆ దేశాల్లో పర్యటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఈ మూడు దేశాలు కలిసి కొత్త కూటమిగా ఏర్పడనున్నాయనే కథనాలు వెలువడ్డాయి. తాజాగా వీటిని బంగ్లాదేశ్ తోసిపుచ్చింది. ఇటీవల జరిగిన త్రైపాక్షిక భేటీ రాజకీయపరమైంది కాదని.. ఎటువంటి కూటమి ఏర్పాటు చేయడం లేదని పేర్కొంది. చైనాలో ఇటీవల రెండు ప్రాంతీయ సదస్సులు జరిగాయి. ఇదే సమయంలో కున్మింగ్‌లో జూన్ 19న చైనా, పాక్, బంగ్లా దేశాల ప్రతినిధులు త్రైపాక్షిక సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. దీంతో ఈ మూడు దేశాలు కొత్త కూటమి ఏర్పాటు చేయనున్నాయనే ఊహాగానాలు వెలువడ్డాయి. దీనిపై బంగ్లాదేశ్ విదేశీ వ్యవహారాల సలహాదారు ఎం. తౌహిద్ హుస్సేన్ మీడియాతో మాట్లాడుతూ.. అధికారుల స్థాయిలోనే సమావేశం జరిగిందని, రాజకీయ స్థాయిలో కాదన్నారు. భారత్‌ను పక్కనపెట్టే ఉద్దేశంతోనే ఆ సమావేశం జరిగిందా? అన్న ప్రశ్నకు బదులిస్తూ.. మూడవపక్షాన్ని లక్ష్యంగా చేసుకున్నది మాత్రం కాదన్నారు. దీనిపై చైనా, పాక్‌లు ఇప్పటికే వేర్వేరు ప్రకటనలు చేశాయి. త్రైపాక్షిక సహకారంపైనే విస్తృత చర్చలు జరిపామని, పరస్పర విశ్వాసం, సమానత్వం, సమ్మిళిత అభివృద్ధి ఆధారంగా ముందుకు సాగాలని నిర్ణయించినట్లు పేర్కొన్నాయి. ఈ సందర్భంగా 'జాయింట్ వర్కింగ్ గ్రూప్'గా ఏర్పడాలని అభిప్రాయానికి వచ్చినట్లు తెలిపాయి. అయితే, బంగ్లాదేశ్ ప్రకటన విడుదల చేసినప్పటికీ.. వర్కింగ్ గ్రూపు ఏర్పాటు నిర్ణయం ప్రస్తావనను మాత్రం తీసుకురాలేదు.

## టోల్ ట్యాక్స్ కట్టాలని అడిగినందుకు.. తుపాకీ గురిపెట్టి కాల్పులు!




కపుర్తలా: జలంధర్‌అమృత్‌సర్ జాతీయ రహదారి వద్ద దారుణ ఘటన చోటుచేసుకుంది. టోల్ ట్యాక్స్ కట్టమని అడిగినందుకు ఓ వ్యక్తి టోల్ ప్లాజా సిబ్బందిపై తుపాకీతో కాల్పులు జరిపి కలకలం సృష్టించాడు. ఈ ఘటన పంజాబ్‌లోని ధిల్వాన్ టోల్ ప్లాజా వద్ద చోటుచేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. దీనిపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకా రం.. నిన్న అర్ధరాత్రి దాటిన తర్వాత టోల్ ప్లాజా వద్దకు ఓ కారు వచ్చింది. టోల్ సిబ్బంది డ్రైవర్‌ను టోల్ ట్యాక్స్ చెల్లించాలని అడగ్గా.. కారులోంచి కిందకు దిగిన ఓ వ్యక్తి కాల్పులు జరపడం ప్రారంభించాడు. దీంతో టోల్ సిబ్బంది భయంతో అక్కడి నుంచి తప్పించుకోగా.. నిందితులు పరారైనట్లు ధిల్వాన్ ఎస్‌హెచ్‌వో దల్వీందర్ సింగ్ వివరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.

## పాక్‌కు అడ్డుకట్ట.. 'తుల్‌బుల్' పునరుద్ధరణకు భారత్ సై!




పహల్గాం ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్‌కు బుద్ధిచెప్పేందుకు గాను సింధూ జలాల ఒప్పందం అమలును నిలిపివేస్తూ భారత్ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. దీంతో దాయాది దేశానికి నీటి కష్టాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో పశ్చిమ నదుల నుంచి నీటిని మరింత సద్వినియోగం చేసుకునేందుకు ప్రణాళికలు రచిస్తున్న భారత్.. సుదీర్ఘకాలంగా నిలిచిపోయిన తుల్‌బుల్ నావిగేషన్ ప్రాజెక్టు పునరుద్ధరణపై దృష్టి సారించినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ ప్రాజెక్టును మళ్లీ పట్టాలెక్కించేందుకు చర్చలు తుది దశలో ఉన్నాయన్న విషయాన్ని అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఈ ప్రాజెక్టు డీపీఆర్ సిద్ధమవుతోందని, ఏడాదిలో పూర్తయ్యే అవకాశం ఉందని పేర్కొన్నాయి. అయితే, ఈ నదుల నుంచి భారత్ వాటాను మరింత సద్వినియోగం చేసుకునేందుకు అనేక ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయని సంబంధిత అధికారి ఒకరు పేర్కొన్నారు. పడమరవైపు ప్రవహించే నదుల్లో ఒకదాని నుంచి నీటిని పంజాబ్, హరియాణాకు మళ్లించే అవకాశం కూడా పరిశీలనలో ఉందన్నారు. సింధూ జలాల ఒప్పందం ప్రకారం.. పశ్చిమదిశగా పాకిస్థాన్ వైపు ప్రవహించే సింధూతోపాటు చీనాబ్, జీలం వంటి ప్రధాన ఉప నదులపై భారత్‌కు పరిమిత అధికారాలు మాత్రమే ఉన్నాయి. భారత్, పాక్ మధ్య 1960, సెప్టెంబరు 19న జరిగిన ఒప్పందం ప్రకారం ఈ నదీవ్యవస్థ మొత్తం నీటిలో 20% భారతదేశం, 80% పాకిస్థాన్ వినియోగించుకోవాలి. అయితే, మన దగ్గర వీటి నీటి నిల్వ సామర్థ్యం తక్కువగా ఉండటం సవాలుగా మారింది. డ్రై సీజన్‌లో కొంతమేరకు నిల్వ చేస్తున్నప్పటికీ.. వర్షాకాలంలో నిల్వ సామర్థ్యం తక్కువగా ఉంది. దీంతో అధిక నీరు వస్తే అది దిగువన పాకిస్థాన్‌కే పోతోందని సంబంధిత అధికారి పేర్కొన్నారు. అంతేకాకుండా ఒప్పందం అమలు వల్ల వరదల సమయాల్లో కొన్ని సవాళ్లు ఎదురయ్యేవన్నారు. కానీ, ప్రస్తుతం రిజర్వాయర్ నిర్వహణపై ప్రముఖంగా దృష్టి సారించామన్నారు. గతంలో పాక్ వ్యతిరేకించిన కిషన్‌గంగా ఇప్పటికే పూర్తికాగా.. రాట్లే ప్రాజెక్టు నిర్మాణం కూడా ముమ్మరంగా కొనసాగుతోందని చెప్పారు.

## 'రాబందులు ఉంటాయి జాగ్రత్త'.. శశిథరూర్ 'పక్షి' పోస్ట్‌కు కాంగ్రెస్ చురక



కాంగ్రెస్ పార్టీతో సీనియర్ ఎంపీ శశి థరూర్ బంధం రోజురోజుకీ మరింత బీటలు వారుతున్నట్లే కన్పిస్తోంది. కాంగ్రెస్ నేతలకు, ఆయనకు మధ్య కౌంటర్లు, చురకలు నిరంతరం కొనసాగుతున్నాయి. పార్టీలో తనపై వస్తున్న విమర్శలను ఉద్దేశిస్తూ థరూర్ నిన్న 'పక్షిని స్వేచ్ఛగా ఎగరనివ్వాల'ని అర్థం వచ్చేలా పోస్ట్ పెట్టారు. దానికి నేడు మరో సీనియర్ ఎంపీ స్పందిస్తూ.. 'రాబందులు ఉంటాయి జాగ్రత్త' అని పరోక్షంగా హెచ్చరించారు. ఇంతకీ ఏం జరిగిందంటే.. ప్రధాని మోదీని ప్రశంసిస్తూ ఇటీవల శశిథరూర్ ఓ కాలమ్ రాశారు. దీనికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే స్పందిస్తూ.. కొందరికి మోదీనే ప్రాధాన్యం అంటూ విమర్శలు గుప్పించారు. దీనికి కౌంటర్‌గా థరూర్ బుధవారం సాయంత్రం ఓ పక్షి ఫొటో షేర్ చేశారు. "ఎగరడానికి ఎవరి అనుమతి అడగకు. రెక్కలు నీవి. ఆకాశం ఎవరి సొంతం కాదు" అనే సందేశాన్ని పంచుకున్నారు. ఖర్గే వ్యాఖ్యలు, పార్టీలో తనపై వస్తోన్న విమర్శలకు బదులుగానే ఈ పోస్ట్ చేశారని ప్రచారం మొదలైంది. ఇది కాస్తా నెట్టింట చర్చనీయాంశమైంది. ఈ క్రమంలోనే థరూర్ పోస్ట్‌ను పరోక్షంగా ఉద్దేశిస్తూ తాజాగా కాంగ్రెస్ సీనియర్ ఎంపీ మాణికం ఠాగూర్ తన 'ఎక్స్' ఖాతాలో ఓ పోస్ట్ చేశారు. "ఎగరడానికి అనుమతి అడగొద్దు. పక్షులు రెక్కలు విరుచుకునేందుకు ఎవరి ఆమోదం అక్కర్లేదు. కానీ, ఈ రోజుల్లో స్వేచ్ఛగా ఎగిరే పక్షి కూడా ఆకాశాన్ని నిశితంగా గమనిస్తూ ఉండాల్సిందే. గద్దలు, రాబందులు ఎల్లప్పుడూ వేటాడుతూనే ఉంటాయి. స్వేచ్ఛ ఎప్పటికీ ఉచితంగా రాదు. " అని రాసుకొచ్చారు. థరూర్‌తో భాజపా నేతల సాన్నిహిత్యాన్ని ఉద్దేశించే ఆయన ఈ విధంగా చురకలు అంటించినట్లు తెలుస్తోంది.

## ఎయిరిండియా విమాన ప్రమాదం.. బ్లాక్‌బాక్స్ నుంచి డేటా డౌన్‌లోడ్ పూర్తి



దిల్లీ: అహ్మదాబాద్‌లో చోటుచేసుకున్న దిగ్భ్రాంతికర విమాన ప్రమాద ఘటనపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టింగ్ బ్యూరో దర్యాప్తు కొనసాగుతోంది. ప్రమాదానికి గురైన విమానం బ్లాక్‌బాక్స్‌ల నుంచి డేటా విశ్లేషణకు మార్గం సుగమమైంది. ఇందులోని డేటాను ఏఏఐబీ ల్యాబ్ విజయవంతంగా డౌన్‌లోడ్ చేసింది. ఈ విషయాన్ని పౌరవిమానయాన మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ మేరకు డేటా విశ్లేషణపై గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. "విమాన ప్రమాదం తర్వాత ఘటనపై దర్యాప్తునకు జూన్ 13న ఏఏఐబీ బృందాన్ని ఏర్పాటు చేసింది. దీనికి ఏఏఐబీ డీజీ నేతృత్వం వహిస్తున్నారు. అదే రోజున ఘటనాస్థలంలోని రూఫ్‌టాప్‌పై కాక్‌పిట్ వాయిస్ రికార్డర్లు, ఫ్లైట్ డేటా రికార్డర్లను గుర్తించాం. ఆ తర్వాత విమాన బ్లాక్‌బాక్సులను కూడా స్వాధీనం చేసుకుని అత్యంత భద్రత నడుమ దిల్లీకి తరలించాం. జూన్ 24 నుంచి వీటిల్లోని డేటాను బయటకు తీసే ప్రక్రియను సాంకేతిక బృందం ప్రారంభించింది. విమానం ముందువైపు ఉండే బ్లాక్‌బాక్స్ నుంచి క్రాష్ ప్రొటెక్షన్ మాడ్యూల్‌ను భద్రంగా బయటకు తీశాం. జూన్ 25న మెమొరీ మాడ్యూల్‌ను విజయవంతంగా యాక్సెస్ చేసి అందులోని డేటాను ఏఏఐబీ ల్యాబ్‌లో డౌన్‌లోడ్ చేశాం. కాక్‌పిట్ వాయిస్ రికార్డర్, ఫ్లైట్ డేటా రికార్డర్‌లో ఉన్న డేటా విశ్లేషణ కొనసాగుతోంది. దీంతో ప్రమాద సమయంలో ఏం జరిగిందో తెలుసుకునేందుకు, ప్రమాద కారణాలను వెలికితీసేందుకు అవకాశం ఏర్పడింది. భవిష్యత్తులో ప్రమాదాల నివారణకు ఈ విశ్లేషణ ఉపయోగపడుతుంది" అని విమానయాన శాఖ తమ ప్రకటనలో వెల్లడించింది. అహ్మదాబాద్ నుంచి జూన్ 12న లండన్ బయలుదేరిన ఎయిరిండియా డ్రీమ్‌లైనర్ విమానం.. టేకాఫ్ అయిన కొన్ని క్షణాల్లోనే కుప్పకూలిపోయింది. ఘటన సమయంలో విమానంలో 242 మంది ఉండగా.. ఒకే ఒక్క వ్యక్తి మాత్రం ప్రాణాలతో బయటపడ్డారు. మిగతా 241 మంది మృతిచెందారు. ఇక, ఈ విమానం మెడికల్ కాలేజీ హాస్టల్‌పై పడటంతో అందులోని పలువురు మృతి చెందారు. మొత్తంగా ఈ దుర్ఘటనలో మృతుల సంఖ్య 270 పైనే ఉన్నట్లు గుజరాత్ ప్రభుత్వం వెల్లడించింది.




## ఈసీ కీలక నిర్ణయం.. 345 రాజకీయ పార్టీలపై కొరడా...

దిల్లీ: రాజకీయ పార్టీగా నమోదై ఎన్నికల్లో పోటీ చేయని రాజకీయ పార్టీలపై ఎన్నికల సంఘం కొరడా ఝుళిపించింది. 2019 నుంచి ఇప్పటి వరకు గడిచిన ఆరేళ్లలో ఒక్క ఎన్నికల్లోనూ పోటీ చేయని 345 గుర్తింపులేని నమోదిత రాజకీయ పార్టీలను (రిజిష్టర్డ్ అన్‌రికగ్నైజ్డ్ పొలిటికల్ పార్టీస్) గుర్తించి వాటిని డీలిస్ట్ చేసే ప్రక్రియను ప్రారంభించింది. ఆయా పార్టీల కార్యాలయాలు కూడా ఎక్కడా లేవని ఈసీ గుర్తించి ఈ నిర్ణయం తీసుకుంది. ఈ జాబితాలో వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన పార్టీలు ఉన్నాయని ఈసీ పేర్కొంది. ఎన్నికల సంఘం వద్ద సుమారు 2800కి పైగా గుర్తింపులేని నమోదిత రాజకీయ పార్టీలు ఉన్నాయి. సాధారణంగా ఒక పార్టీ గుర్తింపు పొందాలంటే సాధారణ ఎన్నికల్లో కనీసం 6% ఓట్లను లేదా నిర్దిష్ట సంఖ్యలో సీట్లను గెలుచుకోవాలి. మిగిలిన పార్టీలను నమోదిత గుర్తింపులేని పార్టీలుగానే పరిగణిస్తారు.

## రాజ్యాంగమే అత్యున్నతమైంది.. పార్లమెంట్ కాదు

: సీజేఐ గవాయ్



భారత్‌లో రాజ్యాంగమే అత్యున్నతమైందని.. ప్రజాస్వామ్యంలోని మూడు విభాగాలు దాని కిందే పనిచేస్తాయని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బి.ఆర్.గవాయ్ వ్యాఖ్యానించారు. బేసిక్ స్ట్రక్చర్ డాక్ట్రీన్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఉద్దేశించి మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగాన్ని సవరించేందుకు పార్లమెంట్‌కు అధికారాలున్నాయి. కానీ, రాజ్యాంగం ప్రాథమిక రూపాన్ని మాత్రం అది మార్చలేదన్నారు. భారత 52వ సీజేఐగా గవాయ్ గత నెల బాధ్యతలు స్వీకరించారు. తూర్పు మహారాష్ట్రలోని అమరావతిలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. శాసన, న్యాయ, కార్యనిర్వాహక విభాగాల్లో ఏది అత్యున్నతమైందని తరచూ చర్చ తలెత్తుతోందని గవాయ్ అభిప్రాయపడ్డారు. "చాలామంది పార్లమెంట్ అత్యున్నతమైందని అంటారు. కానీ, నా ఉద్దేశంలో భారత రాజ్యాంగమే అత్యంత ముఖ్యమైంది. ప్రజాస్వామ్యంలోని మిగిలిన మూడు విభాగాలు దానికిందే పనిచేస్తాయి. మనం విధులు నిర్వహిస్తున్నామని న్యాయమూర్తులు ఎల్లవేళలా గుర్తుంచుకోవాలి. మనం ప్రజల హక్కులకు, రాజ్యాంగ విలువలు, నిబంధనలకు రక్షకులం. కేవలం మనకు అధికారం మాత్రమే లేదు. బాధ్యతలు కూడా ఉన్నాయి. తీర్పుల గురించి ప్రజలు ఏమనుకొంటున్నారు అన్నది జడ్జీలను ప్రభావితం చేయకూడదు. మనం స్వతంత్రంగా ఆలోచించాలి" అని పేర్కొన్నారు. తాను రాజ్యాంగం ప్రసాదించిన హక్కులకు అండగా నిలుస్తానన్నారు. బుల్డోజర్ న్యాయంపై తాను ఇచ్చిన తీర్పు మీద ఆయన స్పందించారు. ప్రతి ఒక్కరికీ నివసించేందుకు ఇల్లు ఉండాలన్నారు. చిన్నప్పుడు తాను ఆర్కిటెక్ట్ కావాలనుకొన్నట్లు చెప్పారు. కానీ, తాను లా చదవడం తన తండ్రి కోరిక అని పేర్కొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన అరెస్టు కావడంతో.. లా చదవలేకపోయారన్నారు.

విత్తనాలు చల్లుదామని పెరట్లోకి వెళతాం. తీరా అక్కడ తొట్టెలో మట్టి పెకలించడానికి సరైన టూల్, నీళ్ల బకెట్ కనిపించవు. అన్నీ ఉంటే కుళాయి నుంచి నీటిని పట్టడానికి ట్యూబ్ ఉండదు. దీంతో ఆసక్తి కాస్తా పోతుంది. ఇలా కాకుండా తోటపనిని సులువుగా ముగించేలా టూల్స్ అన్నీ ఒకేచోట ఉంచే పరికరాలొచ్చాయి.

# తోటపని సులువుగా!








మొక్కలు నాటడానికి వీలుగా గుంత తవ్వాలన్నా, తొట్టెలో గట్టిపడిన మట్టిని వదులు చేయాలన్నా ప్రత్యేక టూల్స్ ఉంటే పని తేలికగా పూర్తవుతుంది. దీనికోసం ముందుగానే చిన్న గునపం, తొలిక... వంటి గార్డెనింగ్‌కు ఉపయోగపడే టూల్స్ అన్నింటినీ ఒకేసారి మార్కెట్‌లో కొనుక్కోవాలి. అలాగే వీటన్నింటినీ ఒకేచోట భద్రపరిచేలా ఇప్పుడు కాటన్ సంచులు, బకెట్స్, చక్రాలతో చిన్న తోపుడుబండిలా టూల్స్ స్టాండు వంటివి దొరుకుతున్నాయి. వీటిలో పరికరాలు నింపి గార్డెన్‌కు సమీపంలో ఉంచితే చాలు. తోటపని చేసేముందు వీటిని తీసుకెళితే సరిపోతుంది. టూల్స్ అన్నీ దగ్గరగానే ఉండటంతో పని సులువు అవుతుంది. అలాగే గార్డెనింగ్ టూల్స్ ఉంచడానికి బెల్ట్‌కు అటాచ్డ్‌గా పౌచ్‌లు వస్తున్నాయిప్పుడు. దీన్ని నడుంకు కట్టుకుంటే చాలు. తోటపనిని ఉత్సాహంగా ముగించొచ్చు. దీంతోపాటు టూల్స్ కవర్ అటాచ్ చేసిన స్టూల్స్ కూడా వస్తున్నాయిప్పుడు. దీనిపై కూర్చుని, విశ్రాంతిగానూ గార్డెనింగ్ వర్క్ చేయొచ్చు.


**నీటి కోసం...**

కుళాయి నుంచి నీటిని ట్యూబ్ ద్వారా మొక్కలకు అందించిన తర్వాత తిరిగి దాన్ని తోటలోనే భద్రపరిచేలా ఇప్పుడు చాలారకాల ఏర్పాట్లు వచ్చాయి. కుళాయికి అటాచ్డ్‌గా వైరు చుట్టడానికి వీలుగా స్టాండు, అలాగే దీనికి పక్కగా మెటల్ తొట్టె లేదా వైరు బుట్ట, లేదంటే గోడకు తగిలించినట్లు ఉండే సిమెంట్ తొట్టె... వంటివెన్నో రకాలు ఇప్పుడు దొరుకుతున్నాయి. దీన్ని సిద్ధం చేసుకుంటే కావాల్సినప్పుడు ట్యూబ్‌ను వినియోగించుకుని ఆ తర్వాత అక్కడే భద్రపరచొచ్చు. మనసుకు నచ్చినప్పుడు తోటపని పూర్తిచేసి ఒత్తిడినీ దూరం చేసుకోవచ్చు కదూ!












సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించడంలో ఆకుకూరలు, ఆకుపచ్చటి కాయగూరల పాత్ర కీలకం. కంటి ఆరోగ్యానికి, బరువును అదుపులో ఉంచుకోవడానికి, చర్మ ఆరోగ్యానికి, రోగనిరోధక శక్తికి.. ఇలా వీటితో బోలెడన్ని ప్రయోజనాలు చేకూరతాయి. అయితే వీటిని వండుకునే క్రమంలో కొన్ని జాగ్రత్తలు పాటిస్తేనే ఈ కూరగాయలు/ఆకుకూరల్లోని పోషకాలు పూర్తిగా శరీరానికి అందుతాయంటున్నారు నిపుణులు. మరి, అవేంటో తెలుసుకుందాం రండి..

# పోషకాలు పోకుండా వండుతున్నారా?







* పాలకూర, తోటకూర, బచ్చలి కూర, గోంగూర, కొత్తిమీర, మెంతి.. వంటి ఆకుకూరలతో పాటు బ్రకలీ, క్యాబేజీ, క్యాలీఫ్లవర్ మొదలైనవన్నీ ఆకుపచ్చటి కాయగూరల కిందకే వస్తాయి. అయితే వీటిని వండుకునే క్రమంలో టీస్పూన్ నూనె/వెన్న/ నెయ్యి.. ఉపయోగిస్తే.. అందులోని పోషకాలు తరిగిపోవంటున్నారు నిపుణులు. పైగా దీనివల్ల ఈ పోషకాలన్నీ శరీరం త్వరగా గ్రహిస్తుందట!
* వండే ముందు ఆకుపచ్చటి కాయగూరల్ని కాసేపు వేడి నీళ్లలో ఉంచితే.. కూర వండే క్రమంలో అవి త్వరగా ఉడుకుతాయి. ఫలితంగా త్వరగా వంట పూర్తవుతుంది. అలాగే ఈ నీటిని అదే కూరలో వాడడం వల్ల వాటిలోని పోషకాలు బయటికి పోకుండా, కూర రుచి పెరుగుతుంది. ఇక్కడ నీళ్లకు బదులుగా వెనిగర్, నిమ్మరసం మిశ్రమంలో కూడా వీటిని వేసి ఉంచచ్చు. ఫలితంగా కూర మరింత రుచిగా, చిక్కగా వస్తుంది.
* అలాగే స్టీమింగ్ పద్ధతిలో కూడా ఈ కాయగూరల్ని ఉడికించచ్చు. వాటిలోని పోషకాలు తరిగిపోకుండా ఉండేందుకు ఇది కూడా ఓ చక్కటి పద్ధతి అంటున్నారు నిపుణులు.
* ఆకుపచ్చటి కాయగూరల్ని వండే క్రమంలో ఉప్పు, మిరియాల పొడి, ఆలివ్ నూనె, వెనిగర్, అల్లం వెల్లుల్లి పేస్ట్, కారం.. వంటివి ఉపయోగిస్తే ఆ కూర రుచి ఇనుమడిస్తుంది. అలాగే ఆయా పదార్థాల్లోని పోషకాలూ శరీరానికి అందుతాయి.

# పాదాలూ మెరిసేలా..!

సాధారణంగా ముఖం, మెడ, చేతులు, జుట్టు.. వీటి గురించి పట్టించుకున్నంతగా పాదాల గురించి పట్టించుకోం. అందుకే ట్యాన్ పేరుకుపోయి అవి నల్లగా కనిపిస్తుంటాయి. అలా కాకుండా పాదాలు కూడా చక్కటి ఛాయతో మెరవాలంటే.. కొన్ని సహజసిద్ధమైన ప్యాక్‌లను ఉపయోగించాలంటున్నారు నిపుణులు. మరి అవేంటో తెలుసుకుందామా..

**పెరుగు..**

పెరుగు ఆరోగ్యాన్ని కాపాడటానికే కాదు.. అందాన్ని సంరక్షించడానికీ ఉపయోగపడుతుంది. అయితే దీన్ని ఎక్కువగా శిరోజ సంరక్షణలోనూ, ఫేస్‌ప్యాక్స్‌లోనూ ఉపయోగిస్తారు. కానీ దీనిలో ట్యాన్ను తొలగించే గుణాలు కూడా ఉన్నాయి. కొద్దిగా పెరుగు తీసుకొని దాన్ని పాదాలకు రాసుకోవాలి. 20 నిమిషాల నుంచి అరగంట పాటు ఆరిన తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకొంటే సరిపోతుంది. ఈ చిట్కాను రోజు విడిచి రోజు పాటించడం ద్వారా చక్కటి ఫలితం కనిపిస్తుంది. అంతేకాదు కాళ్లపై ఏర్పడిన పగుళ్లు సైతం తగ్గిపోతాయి. పాదాల చర్మానికి చక్కటి పోషణ కూడా అందుతుంది.

**నిమ్మరసం**





పాదాలపై ఏర్పడిన ట్యాన్‌ను నిమ్మరసం బాగా వదలగొడుతుంది. దీనిలోని ఆమ్లతత్వం మెలనిన్ శాతాన్ని తగ్గిస్తుంది. ఈ ఫలితం పొందడానికి కొద్దిగా నిమ్మరసం తీసుకొని దానిలో సరిపడా పంచదారను కలిపి మిశ్రమంగా తయారుచేయాలి. ఇది స్క్రబ్‌లా పనిచేస్తుంది. దీంతో పాదాలను కాసేపు మర్దన చేసుకొంటే సరిపోతుంది. ట్యాన్‌తో పాటు మృతకణాలు సైతం ఈ ప్యాక్ ద్వారా తొలగిపోతాయి. చర్మం కాంతివంతంగానూ తయారవుతుంది. ఈ ప్యాక్‌ని తరచుగా ఉపయోగిస్తూ ఉంటే.. పాదాలపై ట్యాన్ పేరుకోకుండా కూడా జాగ్రత్తపడచ్చు. నిమ్మరసం, పంచదార మిశ్రమమే కాకుండా కొద్దిగా నిమ్మరసాన్ని పాదాలకు రాసి అరగంట సమయం ఆరనిచ్చిన తర్వాత కడిగేసినా ఫలితం ఉంటుంది. అలాగే నిమ్మరసంలో కొద్దిగా తేనెను కలిపి ఆ మిశ్రమాన్ని పాదాలకు రాసుకోవాలి. ఆరిన తర్వాత శుభ్రం చేసుకొంటే పాదాలు అందంగా కనిపిస్తాయి.

# నేడు ప్రేక్షకుల ముందుకు కన్నప్ప

## అద్భుతమైన చిత్రం అంటూ నిర్మాత కోన వెంకట్ కితాబు



**టాకీస్:** మంచు విష్ణు ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'కన్నప్ప' జూన్ 27న శుక్రవారం ప్రేక్షకుల ముందుకురానుంది. భారీ తారాగణంతో రూపొందిన ఈ చిత్రంపై మంచు విష్ణు, మోహన్ బాబులు భారీ ఆశలు పెట్టుకున్నారు. భారీ బడ్జెట్‌తో నిర్మించిన ఈ మూవీ నేటి తరానికి సందేశాత్మకం కావాలన్న ఆలోచనతో నిర్మించారు. ఇదిలావుంటే టాలీవుడ్ నిర్మాత కోన వెంకట్ రివ్యూ ఇచ్చారు. సినిమా కంటెంట్ తననెంతో ఆకట్టుకుందని పోస్ట్ పెట్టారు. 'కన్నప్ప' ముందుగానే చూడడం నాకు దక్కిన అదృష్టంగా భావిస్తున్నాను. సినిమా కంటెంట్ ఆసక్తికరంగా ఉంది. ఇందులో ఆశ్చర్యపరిచే సన్నివేశాలు ఎన్నో ఉన్నాయి. చివరి అరగంట ప్రేక్షకులు మంత్ర ముగ్ధులవుతారు. ప్రభాస్ దీనికి ప్రత్యేక ఆకర్షణ. చివరి 20 నిమిషాల్లో విష్ణు అద్భుతంగా నటించారు. ప్రేక్షకులంతా ఆయన నటన గురించి కచ్చితంగా మాట్లాడుకుంటారు. ఎన్నో సంవత్సరాల తర్వాత మోహన్‌బాబు కూడా అందరికీ గుర్తుండిపోయే పాత్రలో కనిపించారు. ఈ సినిమా కచ్చితంగా పెద్ద హిట్ అవుతుందని.. ఈ కష్ట సమయంలో ఇండస్ట్రీకి మరిన్ని లాభాలు అందిస్తుందని ఆశిస్తున్నా' అని పోస్ట్ పెట్టారు. విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్‌గా ఈ సినిమా సిద్ధమైంది. దాదాపు పదేళ్లుగా ఆయన దీనికోసం వర్క్ చేశారు. ముకేశ్ కుమార్‌సింగ్ తెరకెక్కించిన ఈ చిత్రంలో ఆయన టైటిల్ పాత్ర పోషించగా.. రుద్రగా ప్రభాస్, కిరాతగా మోహన్‌లాల్, శివుడిగా అక్షయ్‌కుమార్, పార్వతిగా కాజల్ అగర్వాల్ నటించారు. భారీ బ్జడెట్‌తో మోహన్‌బాబు దీన్ని నిర్మించారు. ఇందులో ఆయన మహదేవశాస్త్రిగా ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారు. 182 నిమిషాలు అంటే 3 గంటల 2 నిమిషాలు రన్‌టైమ్‌తో ఇది ప్రేక్షకుల ముందుకురానుంది.

## నిహారిక కొణిదెల నిర్మాణంలో జంటగా

# సంగీత్ శోభన్, నయన్ సారిక



**టాకీస్:** 2024లో విడుదలై విమర్శకుల ప్రశంసలు అందుకోవటమే కాకుండా.. బాక్సాఫీస్ దగ్గర సూపర్ హిట్ అయిన చిత్రం 'కమిటీ కుర్రోళ్లు'. యూత్‌తో పాటు అన్ని వర్గాల ప్రేక్షకులను మెప్పించిన ఈ చిత్రం ఇటీవల తెలంగాణ ప్రభుత్వం అందించిన గద్దర్ అవార్డ్సులో జాతీయ సమైక్యత, మత సామరస్యం, అణగారిన వర్గాల సామాజిక అభ్యున్నతిపై తీసిన ఉత్తమ ఫీచర్ ఫిల్మ్ అవార్డుతో పాటు చిత్ర దర్శకుడు యదు వంశీకి ఉత్తమ తొలి చిత్ర దర్శకుడిగా కూడా అవార్డ్ వచ్చిన విషయం తెలిసిందే. తొలి ప్రయత్నంలోనే అందరినీ మెప్పించిన ఈ సక్సెస్‌ఫుల్ బ్యానర్‌లో ఇప్పుడు రెండో సినిమా సెట్స్ పైకి వెళ్లనుంది. ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై రూపొందనున్న రెండో సినిమాకు మానస శర్మ దర్శకత్వం వహిస్తున్నారు. మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్ చిత్రాల్లో అద్భుతమైన నటనతో ఆకట్టుకున్న ప్రతిభావంతుడైన యువ కథానాయకుడు సంగీత్ శోభన్ ఈ చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. సంగీత్ సోలో హీరోగా నటించనున్న తొలి సినిమా ఇదే. ఇదివరకే నిహారిక రూపొందించిన వెబ్ ప్రాజెక్ట్సులో హీరో సంగీత్ శోభన్, డైరెక్టర్ మానస శర్మ భాగమయ్యారు.


ఈ చిత్రంలో సంగీత్ శోభన్ సరసన హీరోయిన్‌గా నయన్ సారిక నటిస్తుంది. ఆయ్, క వంటి సూపర్ హిట్ చిత్రాల్లో నటించి మెప్పించిన ఈమె పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ నిర్మించిన జీ5 వారి హలో వరల్డ్, సోనీ లివ్ వారి బెంచ్ లైఫ్ వంటి వెబ్ సిరీస్‌ల్లో ద్వారా తెలుగు కి పరిచయం అయ్యారు. ఇంకా ఈ చిత్రంలో వెన్నెల కిషోర్, బ్రహ్మాజీ, తనికెళ్ల భరణి, ఆశిష్ విద్యార్థి, గెటప్ శీను, సుఖ్వీందర్ సింగ్, అరుణ భిక్షు తదితరులు ఇతర పాత్రల్లో నటిస్తున్నారు.

జీ5తో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ రూపొందించిన వెబ్ సిరీస్ 'ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ'కి మానస శర్మ రచయితగా.. సోనీ లివ్ రూపొందించిన 'బెంచ్ లైఫ్'కి దర్శకురాలిగా పని చేశారు. తాజాగా పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్ రూపొందించనున్న ఈ సినిమాతో మానస శర్మ ఫీచర్ ఫిల్మ్ డైరెక్టర్‌గా ఆంగేట్రం చేస్తున్నారు. ఇక సంగీత్ శోభన్ విషయానికి వస్తే 'ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ'లో ప్రధాన పాత్రలో నటించారు. నిహారిక కొణిదెల నిర్మిస్తున్న ఈ చిత్రానికి మానస శర్మ కథను అందించగా మహేష్ ఉప్పల కో రైటర్‌గా స్క్రీన్ ప్లే, డైలాగ్స్ అందించారు.

# సిద్ధార్థ్ 3బీహెచ్‌కే ట్రైలర్ విడుదల




**టాకీస్:** తమిళ నటుడు సిద్ధార్థ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 3బీహెచ్‌కే. ఈ సినిమాకు శ్రీ గణేష్ దర్శకత్వం వహిస్తుండగా.. శరత్‌కుమార్, దేవయాని, యోగిబాబు, మీతా రఘునాథ్, చైత్ర వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. జులై 4న ప్రేక్షకుల ముందుకు ఈ సినిమా రాబోతుండగా.. అరుణ్ విశ్వ నిర్మించిన ఈ సినిమా తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ ట్రైలర్ చూస్తుంటే.. ఒక మధ్యతరగతి కుటుంబం సొంత ఇల్లు కొనడానికి పడే పాట్లను, వారి కలలను ఆవిష్కరించే భావోద్వేగభరితమైన కుటుంబ డ్రామాగా రాబోతుందని తెలుస్తుంది. ఆసక్తికరంగా సాగిన ఈ ట్రైలర్ ప్రస్తుతం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది.



# ఎన్టీఆర్, హృతిక్ కాంబో వార్-2 కౌంట్ డౌన్ స్టార్ట్

**టాకీస్:** హృతిక్ రోషన్, ఎన్టీఆర్ కీలక పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'వార్ 2' అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్నారు. కియారా అడ్వాణీ కథానాయిక. ఈ స్పై థ్రిల్లర్ కోసం సినీప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మరో 50 రోజుల్లో ఇది విడుదల కానున్న నేపథ్యంలో చిత్రబృందం కౌంట్‌డౌన్ మొదలుపెట్టింది. సినిమాలోని ప్రధాన నటీనటుల సరికొత్త పోస్టర్లను సోషల్‌మీడియాలో పంచుకుంది. ఈ ప్రచార చిత్రాలను అభిమానులతో పంచుకున్న ఎన్టీఆర్.. 'బెట్ కాస్తున్నా.. ఇలాంటి వార్‌ను మీరెప్పుడూ చూసి ఉండరు. కౌంట్‌డౌన్ మొదలుపెట్టండి' అని పేర్కొన్నారు. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో




ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా విడుదల కానుంది. యశ్‌రాజ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై రూపొందుతోన్న స్పై యూనివర్స్‌లో భాగంగా వస్తున్న ఆరో చిత్రమిది. 2019లో విడుదలైన 'వార్'కు కొనసాగింపుగా ఇది రూపొందుతోంది. ఆగస్టు 14న ఇది ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు ఈ సినిమాపై అంచనాలు పెంచాయి. ఈ చిత్రాన్ని ఉద్దేశించి దర్శకుడు అయాన్ ముఖర్జీ ఇటీవల స్పందించారు. 'వార్'కు కొనసాగింపుగా వస్తోన్న చిత్రం కావడంతో 'వార్ 2' విషయంలో నాపై ఎంతో బాధ్యత ఉంది. ఇది నాకు దొరికిన గొప్ప అవకాశంగా భావిస్తున్నా. ఇలాంటి భారీ ప్రాజెక్ట్‌లో భాగమైనందుకు ఆనందిస్తున్నా. ప్రేక్షకుల్లో ఉన్న అంచనాలను దృష్టిలో ఉంచుకొని దీనిని భారీ స్థాయిలో తీర్చిదిద్దుతున్నా' అని చెప్పారు. 'వార్ 2'కు సంబంధించిన సాంగ్ చిత్రీకరణలో భాగంగా గురువారం ఎన్టీఆర్ ముంబయి చేరుకున్నారు.

# 'బిచ్చగాడు 3' విడుదల ఎప్పుడో చెప్పిన విజయ్ ఆంటోనీ

**టాకీస్:** తమిళ నటుడు విజయ్ ఆంటోనీ ప్రధానపాత్రలో తెరకెక్కిన చిత్రం 'మార్గన్'. క్రైమ్ థ్రిల్లర్‌గా రాబోతున్న ఈ సినిమాకు లియో జాన్ పాల్ దర్శకత్వం వహిస్తుండగా.. విజయ్ ఆంటోనీ ఫిలింస్ కార్పొరేషన్ బ్యానర్‌పై మీరా విజయ్ ఆంటోనీ నిర్మిస్తుంది. ఈ చిత్రం జూన్ 27న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సినిమాను తెలుగులో సురేష్ ప్రొడక్షన్ విడుదల చేయబోతుంది. ఈ సందర్భంగా తెలుగు మీడియాతో ముచ్చాటించాడు విజయ్. మంచి కంటెంట్ ఉన్న సినిమాలను తెలుగు ప్రేక్షకులు ఎప్పుడు ఆదరిస్తారని విజయ్ తెలిపాడు. బిచ్చగాడు సినిమా హిట్ అయినట్లుగానే మార్గన్ సినిమా కూడా తెలుగులో మంచి విజయం సాధిస్తుందనే నమ్మకం ఉందన్నారు విజయ్.

అయితే ఈ మీట్‌లో మీడియా అడుగుతూ.. మీ దర్శకత్వంలో సినిమా ఎప్పుడు వస్తుందని అడుగగా.. విజయ్ సమాధానమిస్తూ.. ప్రస్తుతం నేను బిచ్చగాడు 3 సినిమాను తెరకెక్కిస్తున్నాను. 2027లో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఫస్ట్ రెండు పార్టుల కంటే భిన్నంగా ఈ సినిమా ఉండబోతుందని విజయ్ చెప్పుకోచ్చాడు.



ఈ సినిమా కథ విషయానికి వస్తే.. ఒక సైకో స్విమ్మర్ అమ్మాయిలకు ఒక వింత డ్రగ్‌ను ఇచ్చి హత్య చేస్తుంటాడు. ఈ డ్రగ్ ప్రభావం వల్ల వారి భాదితుల శరీరాలు నల్లగా మారి ప్రాణాలు కోల్పోతాయి. అయితే ఈ కేసును దర్యాప్తు చేసే పోలీస్ అధికారి పాత్రలో విజయ్ ఆంటోనీ కనిపించనున్నారు. దర్యాప్తులో భాగంగా అతను కూడా ఈ డ్రగ్ బారిన పడి, అతని శరీరంలో సగం నల్లగా మారడం ట్రైలర్‌లో హైలైట్‌గా నిలిచింది. ఈ హత్యల వెనుక ఉన్న అసలు కారణం ఏమిటి, హంతకుడిని విజయ్ ఆంటోనీ ఎలా పట్టుకుంటాడనేది సినిమా ప్రధాన కథాంశం. ఈ సినిమాలో విజయ్ ఆంటోనీ మేనల్లుడు అజయ్ దిశాన్ విలన్‌గా నటించబోతున్నట్లు సమాచారం. ఈ సినిమా తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానుంది.

# శరవేగంగా పెద్ది షూటింగ్

## త్వరలో జాయిన్ కానున్న జాన్వీ



టాకీస్: గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు కాంబోలో వస్తున్న సినిమా పెద్ది. మైత్రీ మూవీ మేకర్స్ గర్వంగా సమర్పించగా సుకుమార్ రైటింగ్స్ తో కలిసి వృద్ధి సినిమాస్ బ్యానర్ పై సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. స్పోర్ట్స్ ప్రధాన అంశంగా తెరకెక్కుతున్న ఈ సినిమాను బుచ్చి బాబు భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నాడు. రామ్ చరణ్ సరసన బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ ను హీరోయిన్ గా నటిస్తోంది. ఆ మధ్య రిలీజ్ చేసిన పెద్ది ఫస్ట్ గ్లిమ్స్ ఎంతటి సెన్సేషన్ క్రియేట్ చేసిందో చెప్పక్కర్లేదు. మరోవైపు ఈ సినిమా షూటింగ్ ను చక చక చేసేస్తున్నారు. కొంత కాలంగా హైదరాబాద్ లోని రామోజీ ఫిల్మ్ సిటీలో భారీ సెట్స్ మధ్య యాక్షన్ సీన్స్ ఫినిష్ చేసారు. అలాగే టాకీ పోర్షన్ సీన్స్ కూడా చేస్తున్నారు. హీరోయిన్ జాన్వీ కపూర్ జూలై 12న పెద్ది షూటింగ్‌లో తిరిగి జాయిన్ కానుంది. ఆ సమయంలో జాన్వీపై కొన్ని కీలకమైన రొమాంటిక్ సన్నివేశాలు మరియు రెండు పాటలను షూట్ చేయబోతున్నారు. ఇంకా దాదాపు 40 రోజుల చిత్రీకరణ మిగిలి ఉంది. హైదరాబాద్ లో షూటింగ్ ముగించి ఈ నెలాఖరు నుంచి డిల్లీలో షూటింగ్ చేసేందుకు షెడ్యుల్ ఎ÷-లాన్ చేసారు. దాదాపు ఓ ఒక వారం పాటు అక్కడ కీలక సీన్స్ తీయబోతున్నారు. ఎట్టి పరిస్థితుల్లోను ఆర్సీ 16కి సంబంధించిన వర్క్ మొత్తం ఆగస్టు లోపు ఫినిష్ చేయాలని టార్గెట్‌గా పెట్టుకున్నారట. ఏ ఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్న పెద్ది 2026 మార్చి 27 వరల్డ్ వైడ్ గా రిలీజ్ కాబోతుంది.

# సరైన భాగస్వామి కోసం వెయిటింగ్

## ప్రస్తుతానికి ఒంటరినే అంటున్న దంగల్ బ్యూటీ



**టాకీస్:** నటుడు విజయ్ వర్మ, 'దంగల్' బ్యూటీ ఫాతిమా సనాషేక్ డేటింగ్‌లో ఉన్నారంటూ గత కొన్ని రోజుల నుంచి వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. దీనిపై తాజాగా ఫాతిమా పరోక్షంగా స్పందించారు. తాను ఇంకా సరైన భాగస్వామిని పొందలేదని, సింగిల్‌గానే ఉన్నట్లు చెప్పారు. ఆర్.మాధవన్, ఫాతిమా సనాషేక్ నటించిన చిత్రం 'ఆప్ జైసా కోయి' వివేక్ సోని దర్శకత్వంలో ప్రేమకథగా రూపొందింది. ఈ సినిమా ట్రైలర్ విడుదల కార్యక్రమం ఇటీవల ముంబయిలో జరిగింది. ఇందులో పాల్గొన్న ఆమె ప్రేమ, రొమాన్స్ గురించి తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. 'ఒకరినొకరు గౌరవించుకోవడం.. ఇష్టాయిష్టాలను పంచుకోవడంలోనే నిజమైన ప్రేమ దాగి ఉంటుంది. అదే విధంగా కొన్ని విషయాల్లో సర్దుకుపోవాల్సి ఉంటుంది. అలా చేసినప్పుడే బంధాలనేవి సజావుగా సాగుతాయి' అని ఆమె చెప్పారు. దీనిపై ఓ విలేకరి స్పందిస్తూ.. 'వ్యక్తిగత జీవితంలో మీ భాగస్వామిని కనుగొన్నారా?' అని ప్రశ్నించగా.. 'ఇంకా అలాంటి వ్యక్తి నా జీవితంలోకి రాలేదు. నిజం చెప్పాలంటే, మన ఇష్టాలను అర్థం చేసుకొని మనకు గౌరవం ఇచ్చేవారు కేవలం సినిమాల్లోనే ఉంటారు' అని ఆమె బదులిచ్చారు. 'ఆప్ జైసా కోయి' సినిమా కోసం వర్క్ చేయడంపై మాట్లాడుతూ.. 'ఇదొక విభిన్నమైన ప్రేమకథా చిత్రం. దర్శకుడు చెప్పిన కథ నచ్చడంతో వెంటనే ఓకే చెప్పేశా. ఇలాంటి పాత్రను నేను ఎప్పుడూ పోషించలేదు. నా పాత్రలో ఎన్నో కోణాలు ఉంటాయి. మాధవన్ లాంటి గొప్ప నటుడితో స్క్రీన్ షేర్ చేసుకునే అవకాశం వస్తే ఎవరు మాత్రం అంగీకరించరు' అని బదులిచ్చారు. నెట్‌ఫ్లిక్స్ వేదికగా జులై 11న ఇది విడుదల కానుంది. హైదరాబాద్‌కు చెందిన విజయ్ వర్మ ప్రస్తుతం బాలీవుడ్‌లో నటుడిగా రాణిస్తున్నారు. సినిమాలు, వెబ్ సిరీస్‌లు చేస్తున్నారు. 'లస్ట్ స్టోరీస్ 2' సమయంలో తమన్నాతో ఆయన ప్రేమలో పడిన విషయం తెలిసిందే. వ్యక్తిగత కారణాలరీత్యా వీరిద్దరూ విడిపోయినట్లు ఇటీవల కథనాలు వెలువడ్డాయి. ఈ క్రమంలోనే తన తదుపరి ప్రాజెక్ట్ 'ఉల్ జలూల్ ఇష్క్' నటి ఫాతిమా సనాషేక్‌తో ఆయన డేటింగ్‌లో ఉన్నారంటూ కొన్ని రోజుల నుంచి వార్తలు వస్తున్నాయి. వీరిద్దరూ కలిసి ఓ రెస్టరెంట్ వద్ద కనిపించడంతో ఈ వార్తలు తెర పైకి వచ్చాయి.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.